ప్రతిపక్షం
www.prathipaksham.in

సోమవారం 16.03.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 355 పేజీలు: 8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

ఐసీసీ కంటే ఎవరూ పెద్ద కాదు! 8

"రంజాన్ మాసం ఒక పండుగ మాత్రమే కాదు. విలువలను గుర్తుచేసే పవిత్ర మాసం. నెల రోజులపాటు ఆత్మశుద్ధితో పరులకు సహకారం అందిస్తూ అందరితో సత్సంబంధాలను కొనసాగించడమే రంజాన్ మాసం పవిత్రత" రాష్ట్ర ప్రభుత్వం తరపున ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది. సమాజంలో సోదరభావం పెంపొందించి, మతసామరస్యం తో కలిసి మెలిసి జీవించాల్సిన అవసరం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఇప్పటికే మైనారిటీ వర్గాలకు చెందిన నాయకులకు ప్రభుత్వంలో తగిన ప్రాతినిధ్యం కల్పించామని తెలిపారు.

ఈ ప్రభుత్వం మీదే...
నేను మీ సోదరుడిని

- ప్రభుత్వానికి ఆశీస్సులు అందజేయండి
- మతసామరస్యం మన బలం
- విభేదాలు రేకెత్తించేందుకు కొందరు చూస్తున్నారు
- ఆ కుట్రలను తిప్పి కొడుతూ తెలంగాణ అభివృద్ధికి కలిసి నడుద్దాం
- మైనారిటీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాం
- ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వ ఇఫ్తార్ విందులో సీఎం రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 15: "ఈ ప్రభుత్వం మీదే.. నేను మీ సోదరుడిని. ప్రభుత్వానికి మీ ఆశీస్సులు అవసరం" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మతాల మధ్య విభేదాలు రేకెత్తించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, అలాంటి కుట్రలను తిప్పికొట్టి అందరం కలిసి తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. దేశంలోనే తెలంగాణను అభివృద్ధి పరంగా అగ్రగామిగా నిలబెట్టాలని ఆయన ఆకాంక్షించారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మైనారిటీ సంక్షేమ శాఖ ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "రంజాన్ మాసం ఒక పండుగ మాత్రమే కాదు. విలువలను గుర్తుచేసే పవిత్ర మాసం. నెల రోజులపాటు ఆత్మశుద్ధితో పరులకు సహకారం అందిస్తూ అందరితో సత్సంబంధాలను కొనసాగించడమే రంజాన్ మాసం పవిత్రత" అని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తన సందేశంలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. సమాజంలో సోదరభావం పెంపొందించి, మతసామరస్యం తో కలిసి మెలిసి జీవించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల

...:: మిగతా 2లో

మోగిన ఎన్నికల నగారా

పశ్చిమ బంగాల్, కేరళ, తమిళనాడు, అసోం, పుదుచ్చేరి

నాలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు
తేదీలను ప్రకటించిన భారత ఎన్నికల సంఘం

- అసోం: ఏప్రిల్ 9న పోలింగ్, మే 4న కౌంటింగ్
- కేరళ : పోలింగ్ ఏప్రిల్ 9, కౌంటింగ్ మే4న
- తమిళనాడు: పోలింగ్ ఏప్రిల్ 23, కౌంటింగ్ మే 4న
- బంగాల్: పోలింగ్ ఏప్రిల్ 23, 29. కౌంటింగ్ మే 4.
- పుదుచ్చేరి: పోలింగ్ ఏప్రిల్ 9 , కౌంటింగ్ మే 4న3

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, మార్చి 15: దేశంలో ఎన్నికల నగారా మోగింది. పశ్చిమ బంగాల్, కేరళ, తమిళనాడు, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల తేదీలను భారత ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషీలు ఆదివారం సాయంత్రం మీడియా సమావేశం ఏర్పాటు చేసి షెడ్యూల్ ప్రకటించారు. తమిళనాడు (234), పశ్చిమ బెంగాల్ (294),

...:: మిగతా 2లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ – 6.32 (సోమవారం సాయంత్రం)

సహర్ – 5.00 (మంగళవారం ఉదయం)

ఆరు రాష్ట్రాల్లో ఉప ఎన్నికలకు షెడ్యూల్

కేంద్ర ఎన్నికల సంఘం పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌తోపాటే మరో ఆరు రాష్ట్రాల్లో ఉప ఎన్నికలకు కూడా షెడ్యూల్‌ను విడుదల చేసింది.

7



కర్ణాటకలో ఎమ్మెల్యేకు రూ. 5 కోట్లు

రాజ్యసభ ఎన్నికలకు ముందు కర్ణాటకలో 'ఆపరేషన్ లోటస్'కు బీజేపీ ప్రయత్నించిందని డిప్యూటీ సీఎం శివకుమార్ విమర్శించారు. ఇక్కడకు తరలించిన ఒడిశా ఎమ్మెల్యేలకు రూ.5 కోట్లు చొప్పున ఆఫర్ చేసినట్లు ఆరోపించారు.

7

రాహుల్ గాంధీ ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తున్నారు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారతదేశాన్ని దాని ప్రజాస్వామ్యాన్ని కించపరిచేలా వ్యవహరిస్తున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆరోపించారు. ఆదివారం అసోంలోని గువహటిలో జరిగిన బహిరంగ సభ వేదికగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

7

22న రైతు భరోసా విడుదల

- సిద్దిపేట జిల్లా నర్మెట్ట నుంచి విడుదల చేయనున్న సీఎం
- మొదటి రోజు ఎకరం రైతు ఖాతాల్లో నిధులు
- 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ
- రెండో విడత 20 రోజుల తర్వాత విడుదల
- వచ్చే నెలాఖరులోగా మూడో విడత నిధులు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 15 : అన్నదాతలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఈ నెల 22 నుంచి రైతుల ఖాతాల్లో రైతుభరోసా నిధులు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రైతు భరోసా నిధులు విడుదలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి

...:: మిగతా 2లో

మీపై డిఫమేషన్ కేసు వేస్తా..

- ఆదిత్య కన్‌స్ట్రక్షన్ కబ్జాకు పాల్పడిందని మీరే గతంలో లెటర్ రాశారు
- అవే ఆరోపణలతో నేను ధర్నా చేస్తే బద్నాం చేస్తారా?
- తప్పుడు సమాచారంతో ట్విట్టర్‌లో వీడియోలు పెడతరా?
- మీ తప్పులను ఎత్తి చూపిన.. ఇప్పుడు మీ ప్రభుత్వం, మీరు దూకి చావాలి
- మూసీ ప్రక్షాళన అనేది ప్రజలకు మంచి జరిగేలా ఉండాలి
- మొన్నటి ప్రజెంటేషన్లో ప్రజలకు ఏ విధంగా మేలు చేస్తామని చెప్పలేదు?
- గత ప్రభుత్వంలో మూసీ రివర్ బెడ్ లో నిర్మాణాలకు పర్మిషన్ ఇవ్వకుండా ఇప్పుడేలా ఇచ్చారు?
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- హైడ్రా కమిషన్ రంగనాథ్ పై తీవ్రంగా మండిపాటు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 15: హైడ్రా కమిషన్ రంగనాథ్ పై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా మండిపడ్డారు. ఆయనపై డిఫమేషన్ కేసు వేసి కోర్టుకు లాగుతానని హెచ్చరించారు. ఆదివారం బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్ లో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక హైడ్రా అనే మహమ్మరి వదిలైందనని, అది పేదలను కబళిస్తుందన్నారు. మూసీలో నిర్మించిన ఆదిత్య కన్‌స్ట్రక్షన్ కు చెందిన బిల్డింగ్ వద్ద ఇటీవల నిర్వహించిన ధర్నాపై హైడ్రా తప్పుడు ప్రచారం

...:: మిగతా 2లో

ఆదిత్య బిల్డర్స్ నిర్మాణాలపై..

క్రాస్ చెక్ కోసం తహశీల్దార్‌కు లేఖ రాశాం: రంగనాథ్

...:: 3లో

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తత

- ఇరాన్ అణుకేంద్రంపై ఇజ్రాయెల్, అమెరికా దాడులు
- యూఎస్ సైనిక స్థావరాలు లక్ష్యంగా ఇరాన్ దాడులు
- డ్యాన్సింగ్ మిస్సైల్ ప్రయోగించిన ఇరాన్
- భారత నౌకకు తృటిలో తప్పిన ప్రమాదం
- 9/11 తరహా దాడులకు కుట్ర: ఇరాన్
- అమెరికా, ఇజ్రాయెల్ నౌకలకే హోర్ముజ్ జలసంధి బంద్
- ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి కీలక ప్రకటన
- హోర్ముజ్ జలసంధిని ఓపెన్ చేద్దాం.. మీ యుద్ధ నౌకల్ని పంపండి: ట్రంప్

ప్రతిపక్షం నేషనల్ డెస్క్

పశ్చిమాసియాలో పరస్పర దాడులతో ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు సైనిక కేంద్రాలే లక్ష్యంగా సాగిన దాడులు, ఇప్పుడు చమురు క్షేత్రాలపై గురి పెడుతున్నాయి. ఇరాన్ మిలిటరీ సదుపాయాలు, చమురు క్షేత్రాలే లక్ష్యంగా ఇజ్రాయెల్, అమెరికా దాడులు కొనసాగుతున్నాయి. ఇరాన్ కూడా ఏమాత్రం తగ్గకుండా ప్రతీకారదాడులు కొనసాగించింది. అమెరికా, ఇజ్రాయెల్ సైనిక సదుపాయాలే లక్ష్యంగా క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులను ముమ్మరం చేసింది. యూఏఈ నుంచి

...:: మిగతా 2లో

పక్కా సమాచారంతోనే దాడి చేశాం

- 11మందిని అదుపులోకి తీసుకొని విచారించాం
- జర్మనీ తయారీ పాయింట్32 రివాల్వర్‌స్వాధీనం
- 0.26 గ్రాముల కొకైన్, భారీగా బీర్,విస్కీ సీజ్
- వివరాలు వెల్లడించాన ఈగల్ టీం ఎస్పీ గిరిధర్

...:: 2లో

నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు

- ఉభయ సభలనుద్దేసించి నేడు ప్రసంగించనున్న గవర్నర్
- సమావేశాల నిర్వహణ, బందోబస్తు, తదితరాలపై స్పీకర్, చైర్మన్‌సమీక్ష
- 20న బడ్జెట్ బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క
- నేడు గవర్నర్, సీఎం చేతుల మీదుగా శాసనసభ ఆవరణలో తెలుగుతల్లి విగ్రహం ఆవిష్కరణ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 15 : నేటి నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. సోమవారం ఉదయం 11:45 గంటలకు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ప్రసంగిస్తారు. అనంతరం బీఏసీ సమావేశం నిర్వహిస్తారు. సభ ఎన్ని రోజులు నిర్వహించాలనే అంశంపై బీఏసీలో నిర్ణయం తీసుకుంటారు. ఈ నెల 20వ తేదీన శాసన సభలో, మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ నెలాఖరు వరకు బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఈ బడ్జెట్ సమావేశాలు

...:: మిగతా 2లో

రాష్ట్రీయం

ఈ ప్రభుత్వం మీదే... నేను మీ సోదరుడిని

మొదటిపేజీ తరువాయి

అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని సీఎం స్పష్టం చేశారు. ఇప్పటికే మైనారిటీ వర్గాలకు చెందిన నాయకులకు ప్రభుత్వంలో తగిన ప్రాతినిధ్యం కల్పించామని తెలిపారు. మాజీ క్రికెటర్ అజరుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చామని, సీనియర్ నాయకుడు షబ్బీర్‌అలీకి సలహాదారు పదవి కల్పించామని వెల్లడించారు. అదే విధంగా ఎనిమిది మంది మైనారిటీ నేతలకు కార్పొరేషన్ పదవులు కూడా ఇచ్చామని తెలిపారు. క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని సీఎం అన్నారు. భారత క్రికెటర్‌మహమ్మద్ సిరాజ్కు డీఎస్పీ ఉద్యోగం ఇచ్చామని, ప్రపంచ స్థాయి బాక్సర్ నిఖహత్‌జరీన్ కు రూ.2 కోట్ల ఆర్థిక ప్రోత్సాహకం అందించామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతి కార్యక్రమంలో మైనారిటీలకు సింహభాగం ఇస్తున్నామని సీఎం పేర్కొన్నారు. గతంలో వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. ఆ రిజర్వేషన్ల వల్ల అనేక మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాయని చెప్పారు. ఈ రంజాన్ పండుగ ప్రజల్లో సఖ్యత, సోదర భావం తీసుకొచ్చి హిందువులు, ముస్లింలు, సిక్కులు, క్రిస్టియన్లు అందరూ మత సామరస్యంతో రాష్ట్ర అభివృద్ధి ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. ప్రతి సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో మైనారిటీలకు సింహ భాగమిచ్చి ముందుకు నడిపిస్తున్నామని, ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లలో మైనారిటీలకు అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ఈ ఇఫ్తార్ విందులో మంత్రులు మహమ్మద్ అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, లోక్‌సభ సభ్యుడు అసదుద్దీన్ ఓవైసీతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ముస్లిం మతపెద్దలు, మైనారిటీ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

22న రైతు భరోసా విడుదల

మొదటిపేజీ తరువాయి

తుమ్మల నాగేశ్వరరావుతో చర్చించారు. సిద్దిపేట జిల్లా నర్మెట్ట నుంచి రైతు భరోసా నిధులు సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేయనున్నారు. తొలి విడతగా 70 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి ఒక ఎకరం వరకు నిధులు విడుదల చేస్తారు. ఒక ఎకరం వరకు రైతు భరోసా కింద రూ.3,590 కోట్ల నిధులు విడుదల చేయనున్నారు. రెండో విడతగా మరో 20 రోజుల తర్వాత రూ.2,650 కోట్ల నిధులు, మొత్తం మూడు విడతల్లో రైతుల ఖాతాల్లోకి రూ.9 వేల కోట్లు విడుదల చేయనున్నారు. ఏప్రిల్ నెలాఖరులోపు మూడో విడతగా మొత్తం రైతు భరోసా నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పక్కా సమాచారంతోనే దాడి చేశాం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 15: రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని ఓ ఫామ్ హౌస్‌లో డ్రగ్ పార్టీపై ఈగల్ టీమ్ స్పందించింది. పలు కీలక విషయాలను మీడియాకు వెల్లడించింది. బీఆర్ ఎస్ మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్‌లో డ్రగ్స్ పార్టీ జరుగుతోందని సమాచారం రావడంతో సోదాలు చేశామని ఈగల్ టీఎం ఎస్పీ గిరిధర్ తెలిపారు. నేడిక్కడ మీడియాతో మాట్లాడుతూ మొత్తం 11 మందిని అదుపులోకి తీసుకుని విచారించినట్లు వెల్లడించారు. ఫామ్ హౌస్‌లో కొకైన్, రివాల్వర్, కార్ట్రిడ్జ్‌లు స్వాధీనం చేసుకున్నామని తెలిపింది. ఫామ్ హౌస్ లోపలినుంచి తుపాకి పేలిన శబ్దం వచ్చిందని, ఆ వెంటనే ఫామ్ హౌస్‌ను చుట్టుముట్టిన ఈగల్ ఫోర్స్ సోదాలు చేశారని తెలిపారు. పట్టుబడ్డ ఓ వ్యక్తి దగ్గరినుంచి జర్మనీ తయారీ .32 రివాల్వర్.. మరో వ్యక్తి వద్దనుంచి ఖాళీ కార్ట్రిడ్జ కేసులు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించింది. ఫామ్ హౌస్‌లో 0.26 గ్రాముల కొకైన్.. భారీగా బీర్, విస్కీ, వోడ్కా, ప్రీమియం లిక్కర్ బాటిల్స్ సీజ్ చేశామని తెలిపింది. 11 మందిలో 5 మందికి డ్రగ్స్ టెస్ట్‌లో పాజిటివ్ వచ్చిందని వెల్లడించింది. తదుపరి విచారణ కోసం నిందితులను మొయినాబాద్ పోలీసులకు అప్పగించామని తెలిపారు.

డ్రగ్స్ వాడకంపై కఠిన చర్యలు

డ్రగ్స్ వాడకంపై కఠిన చర్యలు ఉంటాయని ఈగల్ ఎస్పీ గిరిధర్ హెచ్చరించారు. 14వ తేదీ సాయంత్రం నిషేధిత మత్తు పదార్థాలు తీసుకుంటున్నట్లు తమకు సమాచారం రావడంతో మొయినాబాద్ ఫామ్‌హౌస్‌పై రైడ్స్ చేశామని తెలిపారు. డ్రగ్స్ ఎక్కడ నుంచి తీసుకువచ్చారనే పూర్తి వివరాలు సేకరిస్తున్నామని అన్నారు. తెలంగాణను డ్రగ్స్ ఫ్రీగా చేయాలన్నదే ఈగల్ టీమ్ లక్ష్యమని.. ఆ విధంగా పనిచేస్తున్నామని చెప్పుకొచ్చారు.

నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు

మొదటిపేజీ తరువాయి

అత్యంత ముఖ్యమైనవని, ఎక్కువ రోజులు జరగడంతో పాటు ఎక్కువ సమయం పాటు జరుగుతాయని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌లు పేర్కొన్నారు. సభ లోపల, బయట కూడా ప్రశాంత వాతావరణం ఉంటేనే సమావేశాలు సాఫీగా జరుగుతాయని వారు స్పష్టం చేశారు. అనుకోని సంఘటనలు, అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రభుత్వానికి, శాసనసభకు మంచి పేరు తీసుకువచ్చేలా పని చేయాలని అధికారులకు, శాసనసభ, మండలి కార్యదర్శులకు సూచించారు. సమావేశాలు సజావుగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర మూడో శాసనసభ ఎనిమిదో సమావేశాలు, తెలంగాణ శాసన మండలి 26వ సమావేశాల నేపథ్యంలో నిర్వహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు శాఖ ఉన్నతాధికారులతో ఈరోజు శాసనసభ భవనంలోని కమిటీ హాల్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు.

ధర్నాలు, ఆందోళనలు జరగకుండా చర్యలు

సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని శాసనసభ, మండలి కార్యదర్శులకు స్పీకర్ గడ్డం ప్రసాద్ సూచించారు. ఆయా శాఖలకు సంబంధించిన చర్చ జరుగుతున్నప్పుడు సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉంటూ మంత్రులకు, సభ్యులకు తగిన సమాచారం అందిస్తూ సహకరించాలని స్పష్టం చేశారు. శాసనసభ, శాసనమండలి సమావేశాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరగడానికి పోలీసు శాఖ తరఫున చర్యలు తీసుకోవాలని సూచించారు. సభ జరుగుతున్న సమయంలో ధర్నాలు, ఆందోళనలు జరగకుండా ముందస్తుగానే సమాచారం అందుకుని, సమావేశాలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

అన్ని శాఖల అధికారులు సమష్టిగా పని చేయాలి

ఈసారి శాసన మండలి, అసెంబ్లీ సమావేశాలు ఒకే ప్రదేశంలో జరుగుతున్నాయని, అందువల్ల అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. మండలి సమావేశాలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమష్టిగా పని చేయాలని, అవసరమైన నోడల్ అధికారులను, లైజనింగ్ ఆఫీసర్లను నియమించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ప్రశ్నలకు వెంటనే సమాధానాలు పంపించాలని తెలిపారు. తెలంగాణ పోలీస్ వ్యవస్థ దేశంలోనే సమర్థవంతమైనదని, మంచి పేరు ఉన్నదని కొనియాడారు. శాసన మండలి సమావేశాలు సజావుగా జరిగే విధంగా సహకరించాలని కోరారు.

తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ

ఈ సమావేశాల్లో ధర్నాలకు ఎక్కువగా పిలుపునిచ్చే అవకాశాలు ఉన్నాయని, చలో అసెంబ్లీ కార్యక్రమాలు జరగకుండా చూడాలని, సమావేశాలకు హాజరయ్యే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మొదటి రోజు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శాసనసభ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ జరుగుతుందని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సభలు సజావుగా జరగడానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన పూర్తి సహాయ, సహకారాన్ని అందిస్తామని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. కోఆర్డినేషన్ కోసం ప్రతి శాఖ నుంచి ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తామన్నారు. ఈ సమావేశంలో శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిలు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా, ఫైనాన్స్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, స్పెషల్ ఫైనాన్స్ సెక్రటరీ సిక్తా పట్నాయక్, డీజీపీ శివధర్ రెడ్డి, ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

రాజ్యసభ ఎన్నికలను ప్రభావితం చేసేందుకు కొంత మంది ప్రయత్నిస్తున్నారు. ఒడిశా కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఒక్కొక్కరికి రూ.5 కోట్ల చొప్పన ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఇది బీజేపీ ఆపరేషన్ లోటస్‌లో భాగం. క్రాస్ ఓటింగ్ చేయాలని నలుగురు వ్యక్తులు తమ ఎమ్మెల్యేలను కాంటాక్ట్ చేశారు. ఈ వ్యవహారంలో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

- కర్ణాటక డిప్యూటీసీఎం డీకే శివకుమార్

మోగిన ఎన్నికల నగారా

మొదటిపేజీ తరువాయి

కేరళ (140), అస్సాం (126)తోపాటు పుదుచ్చేరి (30) రాష్ట్రాల్లో మొత్తంగా 824 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. పుదుచ్చేరితోపాటు నాలుగు రాష్ట్రాల శాసనసభల పదవీకాలం మే, జూన్‌లలో వేర్వేరు తేదీల్లో ముగియనుంది. ఈ రాష్ట్రాల్లో ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పూర్తి చేసిన ఎన్నికల సంఘం. క్షేత్ర స్థాయి పరిస్థితులను పర్యవేక్షించేందుకు ఆయా రాష్ట్రాల్లోనూ ఇటీవల పర్యటించింది. "ఎన్నికలు జరిగే రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతంలో పర్యటించాం. ఎన్నికల షెడ్యూల్‌కు ముందు పార్టీల నేతల సలహాలు స్వీకరించాం. జిల్లా ఎలక్టోరల్ అధికారులు, ఎస్పీలు, ఐజీలు, డీఐజీలతోనూ భేటీ జరిగింది. చీఫ్ ఎలక్టోరల్ అధికారులు, సీఎస్‌లు, డీజీపీలు, నోడల్ అధికారులతోనూ భేటీ జరిగింది. ఎస్ఐఆర్‌కు సంబంధించి బీఎల్‌వోలకు మౌలిక సదుపాయాలు కల్పించాం. పారదర్శక, నిష్పాక్షికంగా ఎన్నికల కోసమే ఎస్ఐఆర్ నిర్వహిస్తున్నాం. ఓటరు అవగాహన కార్యక్రమాల అధికారులు, యువ ఓటర్లతో మాట్లాడాం" అని జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. నాలుగు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతంలో 17.4 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. పారదర్శక, నిష్పాక్షికంగా ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. యువత ముందుకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. భారత్‌లో ఎన్నికల నిర్వహణ అంటే ప్రజాస్వామ్య పండుగ అంటూ వ్యాఖ్యానించారు.

మొత్తం ఓటర్ల సంఖ్య - 17.4 కోట్లు

మొత్తం ఓటర్ల సంఖ్య 17.4 కోట్లు. మొత్తం అసెంబ్లీ స్థానాలు 824. పోలింగ్ స్టేషన్లు 2.19 లక్షలు. ఎన్నికల అధికారులు 25 లక్షలు "ఐదు రాష్ట్రాల్లో మొత్తం 25 లక్షల మంది ఎన్నికల అధికారులు ఉన్నారు. 15 లక్షల మంది పోలింగ్ సిబ్బంది, 8.5 లక్షల మంది భద్రతా సిబ్బంది ఉన్నారు. మొత్తం 2.18 లక్షల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. పోలింగ్, ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నాం. దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. దివ్యాంగులు, వృద్ధులు ఇంటి వద్ద నుంచి ఓటు వేసేందుకు దరఖాస్తు చేయాలి. అభ్యర్థుల ఫొటోలు ఈవీఎంలపై ప్రదర్శించాలని సూచించాం. పోలింగ్ ఏజెంట్ల బూత్‌లు వంద మీటర్ల తర్వాత ఏర్పాటు చేయాలి. ఓటరు సేవల కోసం ఈసీఐనెట్ డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేశాం. అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ వందశాతం వెబ్‌కాస్టింగ్ ఉంటుంది" అని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. కాగా, ఆరు రాష్ట్రాల్లో 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు జరగనున్నాయి. గోవా, గుజరాత్, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల్లో ఒక్క నియోజకవర్గం చొప్పున ఉపఎన్నిక జరగనుంది. కర్ణాటక, మహారాష్ట్రలో రెండు నియోజకవర్గాల చొప్పున ఉపఎన్నికలు జరుగుతాయి. కర్ణాటక(2), గోవా(1), నాగాలాండ్(1), త్రిపుర(1)లో ఏప్రిల్ 9న ఎన్నికల పోలింగ్ జరగనుంది. మహారాష్ట్ర(2), గుజరాత్(1)లో ఏప్రిల్ 23న ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. మే 4న ఉపఎన్నికల ఫలితాలు వెలువడతాయి.

మీపై డిఫమేషన్ కేసు వేస్తా..

మొదటిపేజీ తరువాయి

చేసిందని మండిపడ్డారు. హైడ్రా ప్రకారంపై కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో రంగనాథ్ చేసిన ఆరోపణలనే చేస్తూ తాను ధర్నా చేస్తే తనపై తప్పుడు ప్రచారం చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగనాథ్ సరిగ్గా ఆరు నెలల క్రితమే ఇదే ఆదిత్య కన్ స్ట్రక్షన్ బిల్డింగ్ యాజమాన్యం 0.37 ఎకరాలు ఆక్రమించిందంటూ తహసీల్దార్ కు రాసిన లేఖను ప్రస్తావించారు. అంతేకాకుండా ఈ భవన నిర్మాణాన్ని ఆపకపోతే అందులో ఉండేబోయే వారితో పాటు ఆ చుట్టుపక్కల ప్రజల ప్రాణాలకే ప్రమాదమని లేఖ రాయలేదా? అని ప్రశ్నించారు. వాటికి సంబంధించిన పూర్తి ఆధారాలను తాను సోషల్ మీడియాలో పెడతానని హెచ్చరించారు. అప్పుడు రంగనాథ్, అదే విధంగా ప్రభుత్వం ఎక్కడైనా దూకి చావాల్సి వస్తుందని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. తన ధర్నాకు సంబంధించి హైడ్రా పెట్టిన వీడియోలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే కచ్చితంగా కోర్టుకు ఈడుస్తానని రంగనాథ్ ను కవిత హెచ్చరించారు. నిజం మాట్లాడే వాళ్లదే తప్పు అన్నట్టుగా వీడియోలు ఎడిట్ చేసి ఎదురుదాడి చేస్తారా అన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం, ప్రతిపక్షాలు, ప్రభుత్వానికి బాకాలు ఊదే వాళ్లు కూడా తాను ప్రైవేట్ ప్రాపర్టీలో ధర్నా ఎందుకు చేస్తున్నానని ప్రశ్నిస్తున్నారని.. మూసీ ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారు కాబట్టే బాధ్యతాయుతమైన సంస్థగా హైదరాబాద్ ను పరిరక్షించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. హైడ్రా పేదవాళ్ల ఇళ్లను కూల్చుతూ పెద్దవాళ్ల జోలికి వెళ్లటం లేదని మండిపడ్డారు. పేదవాళ్ల పక్షాన తము కచ్చితంగా పోరాటం చేస్తామని చెప్పారు. హైడ్రాకు దమ్ముంటే నేను ఇప్పటి వరకు ఆధారాలతో సహా 6 కంప్లైంట్స్ చేశానని వాటిపై ఒక్క చర్య కూడా ఎందుకు తీసుకోలేదో సమాధానం చెప్పాలన్నారు. పైగా సిగ్గు లేకుండా పోరాటం చేస్తున్న వారిపైనే తప్పుడు వీడియోలు చేస్తారా అని మండిపడ్డారు. ఈ ప్రభుత్వం, హైడ్రా ఏమైనా గ్రాఫిక్స్ డిజైనర్లా, కంటెంట్ క్రియేటర్లా? అని ప్రశ్నించారు. మొత్తం ప్రభుత్వానికి ఫేక్ డిజిటల్ వాసన వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఆధారాలు లేకుండా ఏదీ మాట్లాడనని స్పష్టం చేశారు. గతేడాదిలో ఆదిత్య కన్ స్ట్రక్షన్స్ వాళ్లు నాలా కబ్జా చేశారని అన్నది రంగనాథ్ కాదా అని కవిత గుర్తు చేశారు. ప్రజందరికీ ఒకే రూల్ ఉండాలన్నదే మా ఉద్దేశమని చెప్పారు. పేదలను కొట్టి పెద్దవాళ్లకు భూములు పంచుతామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

మూసీ ప్రక్షాళనతో ప్రయోజనం ఏంటో చెప్పాలి?..

అటు మూసీ ప్రక్షాళన పేరుతో ప్రజాధనం దోపిడీకి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని కవిత అన్నారు. రెండు రోజుల క్రితం ప్రభుత్వం ఇచ్చి న ప్రజెంటేషన్ లో ఎక్కడ కూడా మూసీ ప్రక్షాళన కారణంగా జరిగే మేలు ఏంటో చెప్పలేదని గుర్తు చేశారు. ప్రపంచ బ్యాంక్ కు తాకట్టు పెట్టేందుకే ఈ ప్రాజెక్ట్ చేపట్టారని గతంలోనే తాను అసెంబ్లీలో చెప్పానని కవిత అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రజెంటేషన్ లో ఫేజ్1 కే దాదాపు 6 వేల 5 వందల కోట్ల నుంచి 7 వేల కోట్లు ఖర్చు అవుతుందని ఇచ్చారని....కానీ ఆరు నెలల క్రితం మాత్రం 5, 641 కోట్లు అని చెప్పారన్నారు. ఆరు నెలల్లో 14 వందల కోట్లు ఎందుకు పెరిగిందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పైగా ఈ ప్రాజెక్ట్ లో ఎస్టీపీల నిర్మాణం, మూసీలో మురుగు నీరు కలిసే 16 నాలాల ప్రస్తావన, పరిహారం గురించి మాట్లాడలేదని అన్నారు. అంటే వాటికి అదనంగా ఖర్చు చేయబోతున్నారని విమర్శించారు. ఇంత చేస్తే అసలు ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రజలకు ఏం మేలు జరుగుతోందన్నది ప్రభుత్వం చెప్పలేకపోతుందన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ లో భాగంగా గత ప్రభుత్వం రివర్ బెడ్ లో 30 లక్షల స్వేర్ ఫీట్ల నిర్మాణం చేపడతామంటే అనుమతి ఇవ్వలేదన్న విషయాన్ని కవిత గుర్తు చేశారు. కానీ ఈ ప్రభుత్వం ఫేజ్1 లోనే 18 లక్షల స్క్వేర్ ఫీట్ల నిర్మాణం చేపడితే ఎలా అనుమతిచ్చారని...దీని వెనుక జరిగిన మాయాజాలం ఏంటనీ ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన లో భాగంగా ఇళ్లు కోల్పోతున్న వారితో కాకుండా రియల్ ఎస్టేట్ ప్రతినిధులు, ప్రపంచబ్యాంక్ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయటమేమిటనీ కవిత అన్నారు. మూసీ ప్రక్షాళన జరగాలని కానీ అది ప్రజలకు మేలు చేసే విధంగా ఉండాలని ఆమె స్పష్టం చేశారు. మూసీ పరిరక్షణ అంటే అక్కడ ఆక్రమణలు జరగకుండా, వ్యర్థాలు మూసీ లో కలవకుండా చూడాలని కోరారు.

వెలుగుమట్లలో పోరాటం కొనసాగుతుంది..

వెలుగుమట్లలో ప్రభుత్వం 750 ఇళ్లను కూల్చేసి అందులో సగం మందికి కూడా న్యాయం చేయటం లేదని కవిత ఆరోపించారు. బాధితుల ఇళ్లు కూల్చిన తర్వాత తాను విశారదన్ మహారాజ్ చేసిన నిరవధిక దీక్షతో ప్రభుత్వం స్పందించిన విషయాన్ని గుర్తుచేశారు. ఐతే 350 కుటుంబాలకు మాత్రమే పట్టాలు ఇస్తామని ప్రకటించి ఇప్పుడు వారిలో సగం మందికి కూడా ఇవ్వటం లేదని తమ దృష్టివచ్చిందని చెప్పారు. అదే విధంగా అక్కడున్న 31 ఎకరాలతో పాటు మరో 30 ఎకరాల భూదాన్ ల్యాండ్ ను ప్రభుత్వం పెద్దవాళ్లకు ఇచ్చే కుట్ర చేస్తుందన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై ఈ నెల 17 న ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ వేస్తామని చెప్పారు. వెలుగుమట్లలో బాధిత కుటుంబాలు అందరికీ న్యాయం జరిగే వరకు వారికి ధర్మ సమాజ్ పార్టీ, జాగృతి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్ సింగ్, ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, నాయకులు ఇస్మాయిల్, లోక రవిచంద్ర, కొట్టాల యాదగిరి, శ్రీకాంత్ గౌడ్, వరలక్ష్మి, లలిత యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తత

మొదటిపేజీ తరువాయి

అమెరికా తమపై దాడులు చేసిందని ఆరోపించిన ఇరాన్.. యూఏఈపై ప్రతిదాడులు ముమ్మరం చేసింది. ఇరాన్ డ్రోన్లు, క్షిపణులను తమ దేశ గగనతల రక్షణ వ్యవస్థ విజయవంతంగా అడ్డుకుందని, అందుకు సంబంధించిన శబ్దాలే ఇవని దుబాయ్ మీడియా ఆఫీస్ వెల్లడించింది. కువైట్ ఎయిర్‌పోర్టుపైనా ఇరాన్ డ్రోన్ల వర్షం కురిపించింది. అయితే ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. యూఏఈపై ఇరాన్ ఇప్పటివరకు 1800 మిస్సైళ్లు, డ్రోన్లను ప్రయోగించింది. ఇందులో 1600 డ్రోన్లు, 294 బాలిస్టిక్ క్షిపణులు, 15 క్రూయిజ్ క్షిపణులు ఉన్నాయి. ఈ దాడుల్లో ఆరుగురు మరణించగా, 140 మందికిపైగా గాయపడ్డారు.

ఇస్ఫహాన్‌లోని ఇరాన్ అణుకేంద్రంపై వైమానిక దాడులు

ఇరాన్ దేశానికి చెందిన అత్యంత కీలకమైన అణుకేంద్రంపై ఇజ్రాయెల్, అమెరికా దేశాలు వైమానిక దాడులకు పాల్పడ్డాయి. అణుకేంద్రం ఉన్న ఇస్ఫహాన్ నగరంపై అమెరికాఇజ్రాయెల్ విమానాలు విరుచుకుపడుతున్నాయి. ఆదివారం ఉదయం నుంచి ఇస్ఫహాన్‌లోని వివిధ ప్రదేశాల్లో భారీ పేలుళ్లు వినిపించాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. చాలాచోట్ల భారీ ఎత్తున నల్లపొగ ఆకాశాన్ని కమ్మేసింది. అమెరికాఇజ్రాయెల్ యుద్ధ విమానాలు చాలా తక్కువ ఎత్తులో ఎగురుతూ దాడులు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. అదేవిధంగా పశ్చిమ టెహ్రాన్‌లోని ఇరాన్ స్పేస్ రిసెర్చ్ సెంటర్‌పై కూడా అమెరికాఇజ్రాయెల్ దళాలు దాడులు చేశాయి. ఇరాన్ తనకు అవసరమైన శాటిలైట్ ఇంటెలిజెన్స్ మ్యాపింగ్ సమాచారాన్ని అక్కడి నుంచే సేకరిస్తుంది. ఇదిలావుంటే ఇరాన్‌పై దాడులకు అమెరికా తన వద్ద ఉన్న బి52 బాంబర్ విమానాన్ని పంపినట్లు తెలుస్తోంది. ఇది దాదాపు 38 టన్నుల బాంబులను తీసుకెళ్లగలదు. దీనికి సంబంధించిన వీడియోను సెంట్రల్ కమాండ్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేసింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో ఆదివారం ఉదయం దాదాపు 20 నిమిషాల వ్యవధిలోనే 20 భారీ పేలుళ్లు వినిపించినట్లు స్థానికులు వెల్లడించారు. ముఖ్యంగా నగరంలోని ఎయిర్‌పోర్టు వద్ద ఇవి చోటు చేసుకున్నట్లు చెబుతున్నారు.

భారత నౌకకు తృటిలో తప్పిన ప్రమాదం

యూఏఈ లోని ఫుజైరా పోర్టుపై శనివారం ఇరాన్ జరిపిన క్షిపణి దాడిలో భారత్‌కు చెందిన ఒక చమురు నౌక త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకుంది. జాగ్ లాడ్‌కీ పేరు గల ఈ నౌక దాడి జరిగిన సమయంలో పోర్టులోని క్రూడ్ ఆయిల్ టెర్మినల్ వద్ద చమురును ఎగుమతి చేసుకుంటున్నది. అయితే ఈ దాడిలో నౌకకు, సిబ్బందికి ఎలాంటి నష్టం జరగలేదు. దీంతో ఈ నౌక ఆదివారం ఉదయం 10.30 గంటకు ప్రయాణమయ్యింది.

9/11 తరహా దాడులకు కుట్ర: ఇరాన్

ఇరాన్ రక్షణ శాఖ ఉన్నతాధికారి ఒకరు అమెరికాపై తీవ్ర ఆరోపణ చేశారు. బాలల లైంగిక నేరగాడు జెఫ్రీ ఎప్‌స్టీన్ నెట్‌వర్క్‌లో మిగిలిన సభ్యులు అమెరికాలో సెప్టెంబర్ 11 తరహా దాడులు చేయడానికి, దానికి ఇరాన్‌ను బాధ్యునిగా చేసేందుకు కుట్ర పన్నారని ఇరాన్ సుప్రీం నేషనల్ కౌన్సిల్ కార్యదర్శి అలీ లారిజానీ ఆరోపించారు.

అమెరికా, ఇజ్రాయెల్ నౌకలకే బంద్

హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ కీలక ప్రకటన చేశారు. జలసంధి చాలా వరకు నౌకలకు తెరిచే ఉందని, అమెరికా, ఇజ్రాయెల్, వాటి మిత్రదేశాలకే మూసివేసినట్టు వెల్లడించారు. ఇతర దేశాల నౌకలు ఈ కీలక మార్గం గుండా వెళ్లేందుకు అనుమతిస్తున్నట్టు చెప్పారు. నూతన సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ తమ దాడుల్లో తీవ్రంగా గాయపడ్డాడని అమెరికా చేస్తున్న ప్రకటనలపై ఆయన స్పందిస్తూ.. ఆయన క్షేమంగా ఉన్నారని స్పష్టంచేశారు.

డ్యాన్సింగ్ మిస్సైల్ ప్రయోగించిన ఇరాన్

ఇజ్రాయెల్‌తో పాటు యూఎస్ సైనిక స్థావరాలు లక్ష్యంగా దాడులు జరుపుతున్న ఇరాన్ సెజ్జిల్ క్షిపణి అలియాస్ డ్యాన్సింగ్ క్షిపణితో పాటు అధునాతన క్షిపణుల శ్రేణిని ఆదివారం ప్రయోగించింది. యుద్ధం మొదలైన తర్వాత తొలిసారి ప్రయోగించిన సెజ్జిల్ క్షిపణి స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేశారు. దాదాపు రెండువేల కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాన్ని ఛేదించగల ఈ క్షిపణి 700 కిలోల పేలోడ్‌ను మోసుకుపోగలదు.

నెతన్యాహు మరణిస్తే.. మరి నేనెవరిని?

ఇరాన్ జరిపిన దాడుల్లో తాను మరణించినట్టు జరుగుతున్న ప్రచారాన్ని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కొట్టివేశారు. చేతిలో కాఫీ గ్లాస్‌తో కన్పించిన ఒక వీడియో మెసేజ్‌లో ఆయన కాఫీ తాగుతూ, తన మరణంపై జరుగుతున్న ప్రచారాన్ని ఎగతాళి చేశారు. నెతన్యాహు ఇటీవల జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడి మరణించారని, ఆయన ఇటీవల టెలివిజన్‌లో కల్పించినది ఫేక్ అని, అది ఏఐ ద్వారా సృష్టించినదంటూ సామాజిక మాధ్యమంలో విస్తృతంగా ప్రచారం జరిగింది. దీనిపై నేరుగా స్పందించిన నెతన్యాహు ఒక వీడియో విడుదల చేస్తూ తాను బతికే ఉన్నానని, తన విధి నిర్వహణలో నిమగ్నమై ఉన్నానని తెలిపారు.

బతికే ఉంటే.. వేటాడి చంపుతాం

నెతన్యాహు మరణ వార్తలపై ఇరాన్ కూడా స్పందించింది. ఆయన బతికే ఉంటే.. వేటాడి చంపుతామని హెచ్చరించింది. ఇజ్రాయెల్‌పై 16వ రోజు కూడా దాడులను కొనసాగించింది 'పిల్లల ఉసురు తీసిన హంతకుడు నెతన్యాహు బతికే ఉంటే అతడిని వేటాడి చంపుతాం' అని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ ఓ ప్రకటనలో హెచ్చరించింది.

మీ యుద్ధ నౌకల్ని పంపండి: ట్రంప్

ఇరాన్ యుద్ధం నేపథ్యంలో హోర్ముజ్ జలసంధిని ఆ దేశం మూసేసిన సంగతి తెలిసిందే. దీంతో అనేక దేశాలకు ఈ జలసంధి నుంచి చమురు సహా పలు ఉత్పత్తుల రవాణా నిలిచిపోయింది. ఇండియా వంటి కొన్ని దేశాల నౌకలను మాత్రమే ఇరాన్ అనుమతిస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక ప్రకటన చేశారు. హోర్ముజ్ జలసంధిని తెరిచేందుకు, నౌకల రవాణా సజావుగా జరిగేందుకు ప్రపంచ దేశాలు తమ యుద్ధ నౌకల్ని పంపాలని ట్రంప్ కోరాడు. ఇక్కడి నుంచి రవాణా చేసే నౌకలకు అండగా తమ యుద్ధ నౌకలు వస్తాయని ట్రంప్ తెలిపాడు. ముఖ్యంగా అమెరికా మిత్ర దేశాలు యుద్ధ నౌకల్ని పంపాలని విజ్ఞప్తి చేశాడు. మరోవైపు ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం నెలకొంటున్న వేళ ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. హోర్ముజ్ జలసంధి నుంచి ఇకపై వివిధ దేశాలకు చెందిన చమురు నౌకల్ని అనుమతించాలని నిర్ణయించింది. అయితే, ఆ నౌక చైనా కరెన్సీ అయిన యువాన్‌లో ట్రేడింగ్ చేయాలని సూచించింది. అలాగే, ఇజ్రాయెల్, అమెరికా నౌకల్ని అనుమతించేది లేదని తెలిపింది.

రాజకీయం

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే
కరెంట్ ఉండదన్నవారికి చెంప పెట్టు

- రికార్డు స్థాయిలో విద్యుత్ పంపిణీ
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 15: 'తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంటు కోతలు ఉంటాయని, రాష్ట్రంలో విద్యుత్ ప్రజలకు అందని ద్రాక్ష లాగా మారుతుందని, విద్యుత్ కోతలతో రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుందని బీఆర్ఎస్ పదేపదే కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేసింది. అయితే అందుకు భిన్నంగా తెలంగాణ రాష్ట్రంలో అసాధారణ స్థాయిలో విద్యుత్ సరఫరా చేసి కాంగ్రెస్ ప్రభుత్వం రికార్డును సృష్టించింది. కరెంటు ఉండదన్న వారికి చెంప చెల్లుమనే విధంగా రికార్డు స్థాయిలో విద్యుత్ సరఫరా చేసి రికార్డు సృష్టించాం' అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు తాజాగా తెలంగాణ విద్యుత్ సంస్థలు అసాధారణ రికార్డును నెలకొల్పడం చర్చనీయాంశంగా మారింది. మార్చి 13 2026న చరిత్రలోనే అత్యధికంగా 341. 08 మిలియన్ల యూనిట్ల విద్యుత్ ను విద్యుత్ సంస్థలు సరఫరా చేశాయి. అదే రోజు ఉదయం 11. 17నిమిషాలకు నమోదైన 18,228మెగావాట్ల గరిష్ట డిమాండ్ ను కూడా తెలంగాణ రాష్ట్ర విద్యుత్ గ్రిడ్ విజయవంతంగా తట్టుకుంది. ఇది తెలంగాణ రాష్ట్ర విద్యుత్ చరిత్రలో ఒక మైలురాయిగానిలుస్తున్నదని ఆయన తెలిపారు.

మా పాలనకు ఇదే నిదర్శనం

ప్రతిరోజు 350 మిలియన్ యూనిట్లకు పైగా వినియోగం, సుమారు 19 వేల మెగావాట్ల గరిష్ఠ లోడ్ ను నిర్వహించే సామర్థ్యం తెలంగాణ రాష్ట్రానికి ఉండడం ఒక గొప్ప విషయంమని భట్టి అన్నారు. తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. ఈ అధిక డిమాండ్ సమయంలో నిరంతరాయ విద్యుత్ సరఫరాను కొనసాగించిన అన్ని విద్యుత్ సంస్థల సిబ్బందిని ఆయన ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా ఇదే తరహాలో ప్రజల అవసరాల మేరకు నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయాలని, అందుకు అనుగుణంగా యాక్షన్ ప్లాన్ రూపొందించుకొని ముందుకు సాగాలని ఆయన సూచించారు. గృహ, పారిశ్రామిక, వ్యాపార వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా విద్యుత్ సరఫరా చేయవలసినటువంటి బాధ్యత విద్యుత్ సంస్థల పైన ఉందని ఆయన పేర్కొన్నారు. కాగా, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వ్యవసాయ రంగంలో అధికంగా విద్యుత్ వినియోగం వెరసి రాష్ట్రంలో విద్యుత్ వినియోగం చాలా ఎక్కువ పెరిగింది. అయితే తెలంగాణ విద్యుత్ సంస్థలు, ప్రజల డిమాండ్ కు తగ్గట్టుగా విద్యుత్ సరఫరా చేయగలుగుతున్నాయి. భవిష్యత్తులో కూడా విద్యుత్ వినియోగం పెరుగుతుంది అన్న అంచనాల నేపథ్యంలో, విద్యుత్ అవసరాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర విద్యుత్ వ్యవస్థలు పూర్తిగా సిద్ధమవుతున్నాయి.

మహిళా రిజర్వేషన్లలో సామాజిక న్యాయం పాటించాలి

- బీసీ సబ్ కోటా కోసం అసెంబ్లీలో తీర్మానం చేయాలి
- డిప్యూటీ సీఎం, పీసీపీ చీఫ్, మంత్రులకు ఇందిరా శోభన్ వినతి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 15: చట్టసభల్లో మహిళలకు కల్పించే 33 శాతం రిజర్వేషన్లలో సామాజిక న్యాయం పాటించాలని, ముఖ్యంగా వెనుకబడిన తరగతుల (బీసీ) మహిళలకు సబ్ కోటా కల్పించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్లతో పాటు మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఆది శ్రీనివాసులను కాంగ్రెస్ సీనియర్ నేత ఇందిరాశోభన్ కోరారు. ఈ మేరకు ఆమె వారిని వ్యక్తిగతంగా కలిసి వినతిపత్రాలను సమర్పించారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీలకు ఎలాంటి ఉపకోటా లేకపోవడం అన్యాయమన్నారు. చట్టసభల్లో ప్రాతినిధ్యం అన్ని వర్గాల మహిళలకు దక్కాలన్నది తమ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీల స్వప్నమని, కానీ ప్రస్తుత చట్టం వల్ల బడుగు బలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఇందిరాశోభన్ ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ మహిళలకు మరింత పటిష్టమైన కోటాతో పాటు, బీసీ మహిళలకూ ప్రత్యేకంగా సబ్ కోటాను కేటాయించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం నడుస్తున్న తరుణంలో, సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్న కాంగ్రెస్ పార్టీ తరపున రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేయాలని వారికి ఇందిరా శోభన్ విన్నవించారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్లలో బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒక ఏకగ్రీవ తీర్మానం ప్రవేశపెట్టాలని ఆమె కోరారు. ఈ విజ్ఞప్తిపై వారంతా సానుకూలంగా స్పందించారని, సామాజిక న్యాయం దిశగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నట్లు ఇందిరా శోభన్ తెలిపారు. బీసీలకు స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు ఇవ్వాలని మొట్టమొదట కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వమే నిర్ణయం చేసి దేశానికి ఆదర్శంగా నిలిచిందని ఆమె గుర్తు చేశారు.

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కేంద్ర మాజీ మంత్రి కావూరు సాంబశివరావు కుటుంబ సభ్యుల్ని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరామర్శించారు. హైదరాబాద్ లోని కావూరు నివాసానికి వెళ్లిన చంద్రబాబునాయుడు, మాజీ గవర్నర్‌బండారు దత్తాత్రేయ కావురి చిత్రపటానికి పూలమాలవేసి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఆయన కేంద్ర మంత్రిగా, ప్రజాప్రతినిధిగా కావూరు సాంబశివరావు అందించిన సేవల్ని గుర్తు చేసుకున్నారు.

- ప్రతిపక్షం, హైదరాబాద్

రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రత్యేకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు డిప్యూటీ సీఎం పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. ఉప ముఖ్యమంత్రితో పాటుగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కలిసిన వారిలో ఆర్థిక శాక ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఫైనాన్స్ -ప్లానింగ్ సెక్రెటరి గౌరవ్ ఉప్పల్, ఆర్థిక శాఖ కార్యదర్శి సిక్తా పట్నాయక్ తదితరులున్నారు.

- ప్రతిపక్షం, హైదరాబాద్

క్రమశిక్షణకు, ఐక్యతకు నిదర్శనం రంజాన్

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

ప్రతిపక్షం, షాద్‌నగర్, మార్చి 15: ప్రకృతిలో క్రమశిక్షణను, సమాజంలో ఐక్యతను పెంపొందించే పవిత్ర రంజాన్ మాసం మానవాళికి ఎంతో సందేశాత్మకమైనదని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ఈడెన్ గార్డెన్ లో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముస్లిం సోదరులు నెల రోజుల పాటు కఠినమైన నియమనిష్టలతో ఉపవాస దీక్షలు చేపడతారని, ఇది వారి భక్తికి, సహనానికి నిదర్శనమని కొనియాడారు. గంగాజమునా తహజీబ్‌కు ప్రతీకగా నిలిచే మన ప్రాంతంలో అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి పండుగలను జరుపుకోవడం శుభపరిణామమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ఇఫ్తార్ విందులు అటువంటి సామరస్యానికి వేదికలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బస్వం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వం, మాజీ జడ్పీటీసీ వెంకట్ రాం రెడ్డి, మాజీ ఎంపీపీ ఖాజా ఇద్రిస్, మైనార్టీ నాయకులు జామ్మద్ ఖాన్, ఎండీ ఇబ్రహీం, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

'టీసీఎస్ఇయాన్' తోఉపాధి అవకాశాలు

- ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్ కో ఆర్డినేటర్ ప్రొ. పల్లవీ కాబడే

ప్రతిపక్షం, హైదరాబాద్, మార్చి 15: డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ టీసీఎస్ఇయాన్‌జాబ్ అఛీవర్ బిజినెస్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్ విద్యార్థులకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించనుందని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్ కోఆర్డినేటర్ ప్రొ. పల్లవీ కాబడే, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. రాఘవేంద్ర పేర్కొన్నారు. డా.బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూపిందించిన 'టీసీఎస్ఇయాన్ జాబ్ అఛీవర్ బిజినెస్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్', ఇటీవల అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ చేపట్టిన ఉపాధి, స్కిల్ బేస్డ్ కోర్సులపై సిటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రొ. పల్లవి, కూకట్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహనా కార్యక్రమాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. రాఘవేందర్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దూరవిద్య ద్వారా ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు టీసీఎస్ఇయాన్ తో మొదటి సంవత్సరం నుంచే కార్పొరేట్ కంపెనీలకు అవసరమయ్యే విధంగా తీర్చిదిద్దుతూ, ప్రపంచ వ్యాప్తంగా పలు కార్పొరేట్ సంస్థలలో అవకాశాలను అందిపుచ్చుకునేలా ఈ కోర్సును ప్రత్యేకంగా రూపొందించినట్లు వివరించారు. ఈ కోర్సును డిగ్రీ చదువుతూనే పూర్తి చేయొచ్చన్నారు. విద్యార్థులకు కెరియర్ వృద్ధి, స్కిల్స్ పెంపొందించడం, ఆంగ్ల భాషపై పట్టు వచ్చేలా వర్క్‌షాప్‌లతో పాటు, క్యూరేటెడ్ వీడియో కంటెంట్, క్విజ్ లు మరియు ప్రాక్టికల్ సెషన్‌ల ద్వారా ప్రయోజనం పొందేలా ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. ప్రొ. ఘంటా చక్రపాణి వీసీ గా పదవీ బాధ్యతలు తీసుకున్న తర్వాత విద్యార్థులకు ఉపాధి కల్పించేలా యూనివర్సిటీ అనేక సరికొత్త కార్యక్రమాలను ప్రవేశపెట్టిందని, వివిధ సంస్థలతో అవగాహన ఒప్పందాలు చేసుకోవడం, సమతా స్కీం కింద ఉచిత విద్య, నిపుణ స్కీం లో ఫెలోషిప్స్ అందిస్తున్నట్లు ఆమె వివరించారు. డా. రాఘవేందర్ మాట్లాడుతూ యూనివర్సిటీ అనేక నూతన విధానాలను విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చిందని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ ప్రొ. శంకర్, అధ్యాపకులు డా. శంకర్, డా. మఖ్దూమ్, సిటీ కళాశాళ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ఆరోగ్యానికి పెద్దపీట

- మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి
- పారిశుధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు, పీపీఈ కిట్ల పంపిణీ

-ప్రతిపక్షం, హుస్నాబాద్, మార్చి15: హుస్నాబాద్ మున్సిపల్ కార్మికుల రక్షణ, ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి పేర్కొన్నారు. 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ టి. మల్లికార్జున్ ఆదేశాల మేరకు శానిటేషన్ సిబ్బందికి పీపీఈ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్ ఆధ్వర్యంలో కార్మికులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బూర్గు లత, కొండ రజిత, పిల్లి తిరుపతి, బొలిశెట్టి రాజు, సావుల మంజుల, పూదరి వరప్రసాద్, గాదెపాక రవీందర్, వాలా సుప్రజ, బత్తుల స్వరూప, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలఎల్లం, ఎంపిహెచ్ఈఓ డి సాంబయ్య, మెప్మా పిహెచ్ఎన్ బి సౌందర్య, రిసోర్స్ పర్సన్లు, మున్సిపల్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జన్మదినం

- పట్టణంలో కార్యకర్తల భారీ ఊరేగింపు
- మున్సిపల్ వైస్ చైర్మన్ మోహన్ ఆధ్వర్యంలో సత్కారం

ప్రతిపక్షం, షాద్‌నగర్, మార్చి 15 : ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జన్మదిన వేడుకలను కార్యకర్తలు నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షాద్ నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ అందే మోహన్ ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. అనంతరం అక్కడి నుంచి భారీ ఊరేగింపు నిర్వహించారు. ఎమ్మెల్యే అభిమానులకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. నేతలు, కార్యకర్తలే తన బలమని ప్రజల దీవెనలు ఉన్నంతకాలం అందరికీ అండగా ఉంటానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం, రఘు, చెంది తిరుపతిరెడ్డి, మాధవులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విశ్వేశ్వరాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి ప్రత్యేక పూజలు

- వేద పాఠశాల అభివృద్ధికి రూ.1,11,000 విరాళం

ప్రతిపక్షం, షాద్‌నగర్, మార్చి 15: షాద్‌నగర్ శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తన జన్మదినం సందర్భంగాప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని శివలింగానికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ అర్చకులు, వేద పాఠశాల విద్యార్థులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు సంగయ్య స్వామి, వేద పాఠశాల విద్యార్థులు ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. జన్మదినాన్ని పురస్కరించుకుని వేద పాఠశాల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే శంకర్ రూ.1 లక్ష 11 వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాశీ వేద పాఠశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శాలువా కప్పి ఘనంగా సన్మానిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, సజ్జల కాశీనాథ్, భువనేశ్వర్, కౌన్సిలర్లు మురళీమోహన్ అప్పి, పెంటయ్య, శివకుమార్, చందు నాయక్, కేకే కృష్ణ, సత్యనారాయణ రెడ్డి, సురేష్, శ్రీకాంత్ రెడ్డి, లింగారెడ్డిగూడెం అశోక్, జంగారి రవి, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య బిల్డర్స్ నిర్మాణాలపై..
క్రాస్ చెక్ కోసం తహశీల్దార్‌కు లేఖ రాశాం

- సమాధానం కోసం ఎదురు చూస్తున్నాం
- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్
- అనుమతులు ఇవ్వడం.. రద్దు చేయడం గత ప్రభుత్వ హయాంలోనే జరిగింది
- వాస్తవాలు మాజీ ఎమ్మెల్సీ కవిత గ్రహించాలని వినతి

ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 15: మూసీ నదిలోకి జరిగి ఆదిత్య బిల్డర్స్ నిర్మాణాలు చేపట్టడంపై వచ్చిన అనుమానాలను నివృత్తి చేయాలని రాజేంద్రనగర్ తహశీల్దార్‌కు లేఖ రాశామని, వారి నుంచి ఎలాంటి సమాధానం రాలేదని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. శాటిలైట్ చిత్రాలను పరిశీలించినప్పుడు డెమ్ నివేదిక ప్రకారం ఉన్న సందేహాల మేరకు తహశీల్దార్‌కు లేఖ రాసినట్టు వివరణ ఇచ్చారు. 'క్షేత్రస్థాయిలో పరిశీలించి సమాధానం ఇవ్వాలని కోరాం. వారి నుంచి ఎలాంటి సమాధానం ఇంకా రాలేదు. మూసీ నదీ తీరంలో ఆదిత్య బిల్డర్స్‌కు నిర్మాణ అనుమతులు ఇవ్వడం.. తర్వాత రద్దు చేయడం గత ప్రభుత్వ హయాంలోనే జరిగింది. దీనినే ప్రస్తుత ప్రభుత్వం కూడా కొనసాగించింది. ఈ రద్దుపై ఆదిత్య బిల్డర్స్ హైకోర్టును ఆశ్రయించడం.. తాము బఫర్ జోన్‌లో నిర్మాణాలు చేపట్టడంలేదని.. వెనక్కి జరిగి నిర్మాణాలు చేపడుతున్నట్టు ఆధారాలతో ఆదిత్య బిల్డర్స్ హైకోర్టుకు నివేదించడం జరిగింది. ఈ విషయాన్ని నిర్ధారించాలని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను హైకోర్టు ఆదేశించడం జరిగింది. ఈ రెండు శాఖలు ఇచ్చిన నివేదిక మేరకు హైకోర్టు నిర్మాణ అనుమతులను పునరుద్ధరించింది. దీంతో నిర్మాణాలు జరుగుతున్నాయి.' అని అన్నారు.

వాస్తవాలు గ్రహించాలని వినతి

వాస్తవాలు ఇలా ఉంటే.. మాజీ ఎమ్మెల్సీ కవిత హైడ్రాను తప్పు పడుతూ పలుమార్లు ప్రశ్నించడాన్ని ఖండిస్తున్నామని హైడ్రా అధికారులు అన్నారు. హైకోర్టు అనుమతులు పునరుద్ధరించినా, మరోసారి నిర్ధారించుకుందామనే ఉద్దేశంతోనే తహశీల్దార్‌కు హైడ్రా లేఖ రాస్తే.. దానిని తప్పు పట్టడం ఏంటని హైడ్రా ప్రశ్నించింది. శాటిలైట్ ఇమేజీలను పరిశీలిస్తే, నదీ గర్భంలోకి జరిగి ప్రహరీ నిర్మిస్తున్నట్టు అనుమానాలు రావడంతోనే నివృత్తి చేయాలని రెవెన్యూ అధికారులను కోరినట్లు హైడ్రా అధికారులు స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని గతంలో కవిత హైడ్రాపై ఆరోపణలు చేసినప్పుడు వివరించామని, మరోసారి హైడ్రాను తప్పు పడుతూ చేస్తున్న వ్యాఖ్యల నేపథ్యంలో తాజా వివరణ ఇస్తున్నట్టు అధికారులు ప్రకటించారు.

నేటి నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్‌హాజరుకావాలని రాష్ట్ర ప్రజల తరఫున కోరుతున్నా. ప్రజల కోసం పాటుపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆయన సలహాలు ఇవ్వాలి. ఇక మూసీపై కేటీఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడం హాస్యాస్పదం. మూసీ ప్రక్షాళన చేస్తే చాలా మంది జీవితాలు బాగుపడతాయి. నల్గొండ ప్రజలకు ఫ్లోరైడ్ బాధలు తప్పుతాయి.

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

బహుళ

పుస్తక పరిచయం

'మూడో కన్ను' తెరిచినప్పుడు కనిపించే సాహిత్య ప్రపంచం

కోట దామోదర్
9391480475

మూడో కన్ను తెరవగానే ప్రపంచం మొత్తం మన కళ్లముందే ప్రత్యక్షమైనట్లు. మూసుకున్న కళ్లతో జీవితం చూడగలమని భావించడం ఒక అపోహ మాత్రమే. ఆ అపోహల పొరలు తొలగినప్పుడే నిజమైన ప్రపంచం మనకు కనిపిస్తుంది. చూడటానికి రెండు కళ్లే సరిపోవు; నిజాన్ని గ్రహించడానికి జ్ఞానం అనే మూడో కన్ను అవసరం. అదే భావాన్ని గుర్తు చేసేలా ముక్కామల చక్రధర్ గారి "మూడో కన్ను" ఒక మేల్కొలుపు స్వరం. ఆయన విశ్లేషణలు మనం గమనించని అనేక విషయాలను ఒక్కసారిగా వెలుగులోకి తీసుకొస్తాయి. సాధారణంగా మన కళ్లకు కనిపించని కోణాలను ఆయన స్పష్టంగా చూపిస్తారు. ఇప్పటివరకు మనకు తెలియని నిజాలు నెమలి పురివిప్పి నాట్యం చేసినట్లు ఒక్కసారిగా మన కళ్లముందు విరబూస్తాయి. నెమలి నాట్యం చూసినప్పుడు మన కళ్లకు కలిగే ఆకర్షణ ఎంత మధురమో, "మూడో కన్ను" వ్యాసాలు చదివినప్పుడు మన ఆలోచనలకు కలిగే ఆకర్షణ కూడా అంతే గాఢంగా ఉంటుంది. సమాజంలో దాగి ఉన్న వాస్తవాలు, కాలగర్భంలో కనుమరుగైపోయిన కవులు, మనం అలవాటుగా చూసి మర్చిపోయిన సాహిత్య సత్యాలు, ఇవన్నీ ఆయన మూడో కన్ను తెరిచిన క్షణంలోనే మన ముందుకు వస్తాయి. ఆలోచించని విషయాలను ఆలోచింపజేయడం, ప్రశ్నించని విషయాలను ప్రశ్నింపజేయడం, కనిపించని వాస్తవాలను స్పష్టంగా చూపించడం. ఇదే నిజమైన మూడో కన్ను పని. అందుకే మూడో కన్ను అంటే కోపం కాదు, వినాశనం కాదు. అది అవగాహన. అది జ్ఞానం. అది మేల్కొలుపు. ఆ కన్ను (పుస్తకం) తెరిచినప్పుడే మనం చూస్తున్న ప్రపంచం వెనుక దాగి ఉన్న అసలు ప్రపంచం మనకు అర్థమవుతుంది. "ఆయన 'యాది' ఎట్లా మరుస్తాం..?" ఈ వ్యాసం చదివిన తర్వాత సామల సదాశివ గారిని మరవడం అసాధ్యమే అనిపిస్తుంది. ఈ వ్యాసంలో ప్రస్తావించిన ఎన్నో విషయాలు చాలా మందికి తెలియనివే అని చెప్పాలి. ఉదాహరణకు, ఉర్దూ గజల్స్‌ను మొదటిసారిగా తెలుగువారికి పరిచయం చేసింది సదాశివ గారేనని మనలో ఎంతమందికి తెలుసు? అంతేకాదు, తెలంగాణ ఉద్యమం సమయంలో ఉద్యమకారులు బయట ప్రపంచంలో జరుగుతున్న విషయాలు తెలుసుకునేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రేడియో బృందంలో సదాశివ గారు కూడా కీలకంగా ఉన్నారని తెలిసినప్పుడు ఆయన వ్యక్తిత్వం ఏంటో అర్థమవుతుంది. ఇలాంటి మరెన్నో అరుదైన విషయాలను విపులంగా అక్షరీకరించడం చక్రధర్ గారికే సాధ్యమనే భావన కలుగుతుంది. ముఖ్యంగా సదాశివ గారు మరియు విశ్వనాథ సత్యనారాయణ గారి మధ్య జరిగిన ఒక సందర్భాన్ని ఆయన ఎంతో చక్కగా, హృద్యంగా వివరించిన తీరు ఈ వ్యాసానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఈ వ్యాసం చదివిన తరువాతే ఆ ఇద్దరు మహనీయుల మధ్య ఉన్న ఆత్మీయత, ఆలోచనా లోతు మనకు స్పష్టంగా అర్థమవుతుంది. "తెలంగాణ తామర పువ్వు దాశరథి" అనే వ్యాసం చదివినప్పుడు నాకు తెలియని ఎన్నో విషయాలు తెలిసి ఆశ్చర్యపోయిన సందర్భం. "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అంటూ తెలంగాణ గర్వాన్ని గీతంగా పలికించిన దాశరథి కేవలం విప్లవ కవియే కాదు; భక్తి గీతాలను కూడా అంతే అలవోకగా రాయగల అరుదైన ప్రతిభ కలిగిన మహాకవి అని ఈ వ్యాసం స్పష్టంగా తెలియజేస్తుంది. విప్లవ స్వరంతో సమాజాన్ని మేల్కొలిపిన కవి, భక్తి భావంతో హృదయాలను కదిలించిన కవి... ఈ రెండు పరస్పర విభిన్నమైన ధోరణులను సమానంగా మిళితం చేసి తెలంగాణ సాహిత్యంలో ఒక శక్తిగా ఎదిగిన దాశరథి వ్యక్తిత్వాన్ని చక్రధర్ గారు ఎంతో హృద్యంగా, విశ్లేషణాత్మకంగా వివరించారు. ఆయన రచనలు దాశరథి కేవలం ఒక కవి కాదు; తెలంగాణ ఆత్మను పలికించిన స్వరం అనే భావన స్పష్టంగా ప్రతిధ్వనిస్తుంది. కవిత్వంలో ఒక ప్రత్యేక ప్రయోగం గా నిలిచిన



"ముక్త పద గ్రస్తం" దాశరథి గారు పాట రూపంలో వినియోగించిన తీరు ఎంత అద్భుతమో ఈ వ్యాసం చదివినప్పుడు మరింత స్పష్టమవుతుంది. నిజానికి ముక్త పద గ్రస్తం అనే అలంకార శైలిపై ఈ కాలం వారికి అంతగా పరిచయం లేకపోయినా, దాశరథి కవిత్వంలో అది ఎలా ఒదిగిపోయిందో ఎంతో హృద్యంగా వివరించారు. అలాంటి అరుదైన సాహిత్యాంశాలను ఈ వ్యాసంలో పొందుపరచడమే కాకుండా, వాటిని సామాన్య పాఠకులకు సులభంగా అర్థమయ్యే రీతిలో అందించడం నిజంగా ప్రశంసనీయం. చక్రధర్ గారు రచించిన "కూసుమంచి అగ్రహారం నుంచి మూడో కన్ను వరకు" వంటి రచనలు చదివినప్పుడల్లా ఆయన సాహిత్య దృష్టి ఎంత విశాలమో అనిపిస్తుంది. ఆయన రచనల పట్ల నాకు కూడా అపారమైన అభిమానం ఉందని ఈ సందర్భంగా చెప్పక తప్పదు. "పూల పాటల పండుగ బతుకమ్మ" తెలంగాణ ఆత్మను పలికించే ఆడబిడ్డ ల ఆనందోత్సవం. తెలంగాణ ఉద్యమ కాలంలో బతుకమ్మ ఆట పాటలు కేవలం పండుగ సంబరాలు మాత్రమే కాదు, ఉద్యమానికి ఊపిరి పోసిన శక్తి గా మారాయి. గ్రామాలు, పట్టణాలు అన్న తేడా లేకుండా మహిళలు బతుకమ్మ చుట్టూ చేరి పాడిన పాటలు ఉద్యమానికి ధైర్యాన్ని, ఆశను నింపాయి. ఆ పూల మధ్య పుట్టిన గానమూ, ఆత్మగౌరవం కోసం ఎగిసిన నినాదం కలిసి తెలంగాణ ఆత్మను ప్రపంచానికి చాటి చెప్పాయి. అందుకే ఉద్యమ సమయంలో బతుకమ్మ ఆటపాటలతో ఉద్యమానికి ఊపిరినందించిన ఆ క్షణాలు ప్రపంచ చరిత్రలోనే ఒక గొప్ప ఘట్టంగా నిలిచాయంటారు రచయిత ముక్కామల చక్రధర్ గారు. "దిగంబర కవితో కొన్ని గంటలు" అనే వ్యాసం చదువుతుంటే అది కేవలం ఒక రచనగా కాకుండా, మనసులో నిద్రపోయిన జ్ఞాపకాలను మెల్లగా మేల్కొలిపే అనుభూతిగా అనిపిస్తుంది. ఒక మంచి వ్యాసం పాఠకుడిని తన జీవితంలోని చిన్న చిన్న సంఘటనల వద్దకు తీసుకెళ్తేనే అది సార్థకమవుతుంది. ఈ వ్యాసం కూడా అచ్చం అలాంటి అనుభూతిని కలిగిస్తుంది. ఈ వ్యాసం చదువుతున్నప్పుడు నా చిన్నప్పటి జ్ఞాపకాలు కళ్లముందు తిరిగాయి. చిన్నప్పుడు మా ఇంటికి అమ్మమ్మ, తాత వచ్చేవారు. వాళ్లు వచ్చిన రోజుల్లో ఇంటి అంతా ఒక ప్రత్యేకమైన ఆనందంతో నిండిపోయేది. కానీ వారు మరుసటి రోజు వెళ్తారని తెలిసిన క్షణం మనసులో ఒక విచిత్రమైన బాధ కలిగేది. "ఇంకో రెండు రోజులు ఉంటే బాగుండును" అనే ఆలోచన సహజంగానే మనసులో మెదిలేది. అప్పుడు చిన్న పిల్లల అమాయకత్వంతో ఎన్నో చిన్న చిన్న ప్లాన్లు వేసేవాళ్లం. వాళ్లు వెళ్లే ముందు వారి బ్యాగ్ దాచిపెడితే, అది దొరకక ఇంకో రోజు అయినా ఉండిపోతారేమో అనే బాల్యపు ఊహలు మనసులో మెదిలేవి. ఆ చిన్న ప్రయత్నాల వెనుక దాగి ఉండేది ప్రేమ మాత్రమే. అలాగే ఈ వ్యాసంలో కూడా దిగంబర కవి నగ్నముని తో గడిపిన ఆ కొన్ని గంటలు రచయితకు ఎంతో విలువైనవి గా అనిపిస్తాయి. నవ్వుతూ, మాట్లాడుకుంటూ గడిపిన ఆ క్షణాలు తక్కువ సమయం అయినప్పటికీ హృదయంలో చిరస్థాయిగా నిలిచిపోయే జ్ఞాపకాలుగా మారాయి. మనకు ఇష్టమైన వారితో గడిపిన సమయం ఎప్పుడూ చాలదనే భావన ఈ వ్యాసంలో స్పష్టంగా కనిపిస్తుంది. అంతిమంగా ఈ వ్యాసం మనకు ఒక సత్యాన్ని గుర్తుచేస్తుంది... మన జీవితంలో గొప్ప జ్ఞాపకాలు పెద్ద సంఘటనల వల్ల కాకుండా, ఇలాంటి చిన్న చిన్న అనుభూతుల వల్ల ఏర్పడతాయి. అవి గడిచిపోయినా, మనసులో మాత్రం ఎప్పటికీ నిలిచిపోతాయి. "మూడో కన్ను"లోని అన్ని వ్యాసాలు అద్భుతమే. ప్రతి వ్యాసానికి తనకంటూ ఒక ప్రత్యేకమైన శైలి, ప్రత్యేకమైన అనుభూతి ఉంది. ఇక్కడ నేను కొన్ని వ్యాసాల గురించి మాత్రమే ప్రస్తావించాను. ఎందుకంటే ప్రతి వ్యాసం గురించి నేనే పూర్తిగా చెబితే, మీరు చదివే ఆసక్తి తగ్గిపోతుంది. ఈ రచనల అసలు రుచిని తెలుసుకోవాలంటే మీరు స్వయంగా చదవాలి. అందుకే మీరందరూ 'మూడో కన్ను'ను తప్పక చదవాలి. అప్పుడు మాత్రమే ఆ వ్యాసాల లోతు, భావం, అందం నిజంగా అనుభూతి అవుతుంది." ప్రతి వారం విశాలాంధ్రలో వెలువడే ఆయన కాలమ్ చదవని రోజు లేదనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. కూచిమంచి అగ్రహారం నుంచి "మూడో కన్ను" వరకు ఆయన రాసిన వ్యాసాల్లో నేను చదవని దాదాపు ఒక్కటీ లేదు. ఆయన నుంచి ఎప్పుడు వాట్సాప్ సందేశం వస్తుందా అని ఎదురు చూసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇప్పటికీ ఆ ఆసక్తి ఏమాత్రం తగ్గలేదు అనుకోవచ్చు. ముక్కామల గారి "మూడో కన్ను" నిజంగా అదిరిపోయింది. ఆలోచింపజేసే దృష్టి, ప్రత్యేకమైన శైలి, మనసును తాకే భావాలతో ప్రతి వ్యాసం నిలిచిపోతుంది. ఇక ఆయన "నాలుగో కన్ను" ఎప్పుడు తెరుస్తారో అని ఆసక్తిగా ఎదురు చూడాల్సిందే.

పరిచయం

మౌనభాషలో దక్కన్ హైదరాబాద్ గుండె గొంతుక జిలానీ బానో

డా.టి.రాధాకృష్ణమాచార్యులు
9849305871

ఓల్డ్ హైదరాబాద్ హవేలి ఇరుకు సందులలో ఉరుకుల మౌనం మాట్లాడిన బతుకుగీతం ఓ అక్షర సంగీతం.మూసిన కిటికీ గదుల గోడల పరదాల కథాకథనం వినిపించిన ఓ మహా విస్ఫోటనం. అక్షరాల స్వరాలను హైదరాబాద్ గుండె గొంతుగా, నాలుకను స్వేచ్ఛ విహంగ రెక్కల ఊపిరిగా చేసిన తన రచనలతో మట్టినీ మనిషినీ చైతన్యపరిచిన 'హైదరాబాద్ వతన్ కా విరాసత్', ఓ అక్షరాయుధారి మహా రచయిత్రి జిలానీ బానో. గొప్ప తపన,మంచి పట్టుదలకు మారుపేరుగా ఉర్దూ సాహిత్యంలో రచనలు చేసిన జిలానీ బానో జూలై 14,1936న ఉత్తరప్రదేశ్ లోని బదాయున్ లో జన్మించారు.ఆమె తండ్రి హసన్ హైరాత్ బదాయుని ప్రఖ్యాత ఉర్దూ రచయిత,నిజాం సంస్థానంలో ఉద్యోగి కూడా.ఇప్పటికీ మల్లేపల్లి పరిసరాల్లో ఆయన పేరున 'బదాయూన్ రోడ్డు' ఉంది. జిలానీ బానో పుట్టిన చోటనే ప్రాథమిక విద్య చదివింది. ఆమె వైవాహిక జీవితం దక్కన్ హైదరాబాద్ (ప్రస్తుత తెలంగాణ) కు చెందిన ప్రసిద్ధ ఉర్దూ రచయిత,ఉస్మానియా యూనివర్సిటీలో ఇస్లామిక్ స్టడీస్ హెచ్ ఓ డి.,ప్రొఫెసర్ గా పనిచేసిన అన్వర్ల మొయజ్జమ్ తో ప్రముఖ కవి ముగ్దూమ్ మోహియుద్దీన్ చొరవతో జరిగింది. దాంతో ఆమె మకాం స్త్రీలపైగల అన్ని కట్టుబాట్ల బదాయూన్ గ్రామం వీడి రెక్కల పక్షి స్వేచ్ఛతో హైదరాబాద్ లోని నాంపల్లి ప్రాంత సమీప మల్లేపల్లి కి మారింది. దాంతో ఇక్కడ ఇంటర్మీడియట్ విద్య చదివిన జిలానీ బానో ఎం.ఏ.,ఉర్దూ సాహిత్యం పట్టా పొందారు. దాదాపు ఏడు ఎనిమిది దశాబ్దాల క్రితం (అంటే 75 ఏండ్ల కిందటి) సంగతి,హైదరాబాద్ పట్నంలోని మల్లెపల్లిలోని ఆమె ఇంట్లో సాహిత్య సాంస్కృతిక వాతావరణం ఎక్కువగా ఉండేది. అప్పటికే అక్కడ ప్రదర్శించే నాటకాలలో భారతం, భాగవతం, రామాయణ కథా ఇతివృత్తాలను చూసిన బానో ఆ కథలను అక్కడి పిల్లలకు చెప్పడం విశేషం. ఆనాటి సీతా దేవి కష్టాలను సహించలేని జిలానీ బానో పెద్దయ్యాక స్త్రీలలో మానసిక ధైర్యం ప్రోదిచేసే కథలను ప్రేరణాత్మకంగా చిత్రించి రాసిన వైనం అది.అప్పుడే సినీ కవులు షకీల్ బదయూనీ,కైఫ్ ఆజ్మీ, హైదరాబాద్ కవి మగ్దూమ్ వంటి వారెందరో కలిసేవారు. అట్లనే ఆ రోజుల్లో హైదరాబాద్ వచ్చిన ప్రముఖ పాకిస్తాన్ కవి ఫైజ్ మహ్మద్ ఫైజ్ మల్లెపల్లిలోని జిలానీ బానో ఇంటికివచ్చి అక్కడే బసచేయడం రచయిత్రిగా జిలానీ బానోకు దక్కిన గౌరవం. ప్రాథమిక విద్య దశలోనే దాదాపు 14 ఏండ్లకే రచన చేయడం ప్రారంభించిన జిలానీ బానో తొలి కథ 'ఏక్ నజర్ ఇధర్ భీ'1952లో వచ్చింది.ఆమె సాహిత్య ప్రస్థానంలో ప్రసిద్ధ 22 గ్రంథాలలో 'రోషిణి కె మీనార్', 'ఐలాన్ఎగజల్' వంటివి ఉన్నాయి.ఆమె సొంత చరిత్రతో 'అఫ్సానా',అట్లనే 'దూర్ కీ ఆవాజే' నవల (తను ఇతర రచయితలతో నెరిపిన ఉత్తర ప్రత్యుత్తరాల సేకరణ) గ్రంథం రాశారు. ఆమె సాహిత్యం అనేక భాషలలోకి తర్జుమా అయింది. అందులో హైదరాబాద్ నగర సంస్కృతిని,తెలంగాణ సామాజిక ఆర్థిక నేపథ్యం, జనసామాన్యం జీవితాలను తన కలంతో ప్రపంచానికి పరిచయం చేశారు. దాదాపు 95 పైగా పుస్తకాలను రచించిన ఆమె ఉర్దూ సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్రవేశారు. ఆమె రచనలు కొన్నింటిని దాశరథి రంగాచార్య తెలుగులోకి అనువదించారు. జిలానీ బానో రచనలు కేవలం భారతీయ భాషలకే పరిమితం కాలేదు. రష్యన్, ఇంగ్లిష్, జర్మన్, నార్వేజియన్ వంటి యూరోపియన్ భాషల్లోకి అనువాదమయ్యాయి. ఆమె సాహిత్యం పై ఉజ్బెకిస్తాన్ వర్సిటీ, ఢిల్లీ జఎన్‌యూ, అలీఘడ్ ముస్లిం వర్సిటీల్లో పరిశోధనలు జరిగాయి. ప్రముఖ ఉర్దూ రచయిత్రిగా ఆమె 2001లో భారతదేశ అత్యున్నతమైన ప్రతిష్టాత్మక అవార్డ్స్ లలో ఒకటైన 'పద్మశ్రీ' అందుకున్నారు. ఆమె 2016 ఎన్టీఆర్ జాతీయ సాహితీ పురస్కారానికి ఎంపికయ్యారు. అంతేకాదు ఆమెకు ఆనాటి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం 1960 లోనే వరిస్తే, 1985లో సోవియట్ లాండ్ నెహ్రూ అవార్డు లభించింది. ఆమె ఖౌమీ హాలి అవార్డును 1989లో హర్యానా ఉర్దూ అకాడమీ నుండి పొందింది. 2014 సంవత్సరానికి త్రిపురనేని గోపీచంద్ జాతీయ పురస్కారాన్ని కూడా జిలానీ బానోకు అందుకున్నది. గుప్పిట జారే ఇసుక ఆమె ఉర్దూ కథల తెలుగు అనువాదం. అంత నిజమే చెప్తా 'మెహక్' అనే రచయిత ద్వారా అనువదించబడిన కథల సంపుటి.'నేనెవరిని?'(మెయిన్ కౌన్ హూన్) ఆమె ఆత్మకథ, తెలుగులో 'తెరిచిన పుస్తకం' పేరుతో విడుదలైంది. అట్లనే బాలసాహిత్యంలో పిల్లల కోసం ఆమె రాసిన రెండు కథలు 'నవ్వే గులాబీ' మరి 'మంత్రాల పెట్టె' పేరుతో తెలుగులో ఎన్ బి టి సంస్థచే ప్రచురితం.ఆమె రచన "మరియం ఆఫ్ వ్యాక్స్" ఆమె సాహిత్య నైపుణ్యానికి ఒక ప్రధాన ఉదాహరణ. మొత్తంగా అంతర్లీన శక్తిగా ఆమె రచనలు కళ్లముందే నడయాడిన అన్యాయాన్ని, నాటి భూస్వామ్య పెత్తందారీ వ్యవస్థలో స్త్రీలపై జరిగిన దురాగతాలను ధైర్యంగా చెప్పిన 'మార్పు' అనివార్యతను చూపే వెలుగు మనకు కనిపిస్తుంది. ఆమె మరణంతో ఆ వెలుగు అంతరించినా ఒక దారి దీపంలా ఆ వెలుగు జీవిస్తుంది. ఉర్దూ సాహిత్యంలో ఆమె సృష్టించిన ఒక శకం ఆమెది.దక్కన్ హైదరాబాద్ రచయిత్రిగా పాతనగరం చారిత్రక, సాంస్కృతిక పాదుల్లో పుట్టి ఎదిగిన ఆమె జీవితం సాహిత్యం స్త్రీల బాధలు,మధ్యతరగతి మందహాస గాయాలు,దేశ విభజన,హృదయ విభజనలోని ఆవేదన,వేదనల ప్రతిధ్వనుల చిత్రణే తన రచనల ఇతివృత్తాలుగా రాసిన జిలానీ బానో పుట్టిన పేరు జైనత్ సాజిదా. జిలానీ బానో కేవలం సాహిత్య వేత్త మాత్రమే కా దు,ఆమెలో మనకు ఉత్తమ సామాజికవేత్త కూడా కనిపిస్తారు. ప్రగతిశీల భావాలు,కవి సంగమాలు, సాహిత్యోద్యమాలు వాటి ప్రభావం జిలానీ బానో రచనల్లో కనిపిస్తాయి.ప్రముఖ సృజనకారులు ఇస్మత్ చుంగ్తాయి, సామాజిక స్పృహ,ప్రేరణ కలిగించిన జిలానీ బానో ప్రైడ్ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్ కీ షాన్ అనడంలో అతిశయోక్తి లేదు. ఆమె ఇక లేరు మనకు,భౌతికంగా.కానీ ఆమె తన రచనలతో సజీవం, అంతేకాదు హైదరాబాద్ నగర వీధులు రోజూ పాడుకొనే సాహిత్య సాంస్కృతిక అమరగీతం. ఆమె గగనసీమల చైతన్యపరిచే సాహస సృజన ధాత్రి. ఆమె రచనలను భవిష్యత్తరాలకు చదువుకొనే పాఠ్యాంశంగా అందించడమే ఆ గొప్ప సృజనజీవికి అందించే ఘన నివాళి.

కవిత

వానరాగాలు

చెట్లు పెంచు ... అడవులు సృష్టించు,
పచ్చదనం పరచు... మబ్బులు తేలించు,
చినుకులు రాలనీ ... వాగులు పారనీ,
గొంతుల దప్పిక తీరనీ ... మనసులు మురిపించనీ.

వానను రానీ,
వాడిన నేలపై వాసంతం చిందనీ.
వానను కురవనీ,
వేల జీవుల్లో వెలుగులు నింపనీ.

వానను తడుపనీ,
తడిసిన పొలాల్లో పచ్చదనం పూయనీ.
వానను పారనీ,
వాగుల గుండెల్లో గలగలలాడనీ.

వానను పొంగనీ,
కాలువల ఒడిలో కలల్ని నింపనీ.
వానను పాడనీ,
మేఘాల వీణలో మధురంగా మ్రోగనీ.

వానను సాగనీ,
పల్లెల గుండెల్లో పంటల్ని పండనీ.
వానను మాట్లాడనీ,
చినుకుల భాషలో ప్రేమలు చెప్పనీ.

వానను నవ్వనీ,
మనసుల మైదానాల్లో మాధుర్యాలు చల్లనీ.
వానను ఒలుకనీ,
జీవజాలానికి జీవామృతం పంచనీ.



గుండ్లపల్లి రాజేంద్ర ప్రసాద్,
భాగ్యనగరం.

సమీక్ష

రంగంపేట 'వెలుగు రేఖలు'

చంద్రకాంత్ గౌడ్ యాడవరం
9441762105

సెల్ ఫోన్లు, టీవీలకు వివిధ మాధ్యమాలకు అలవాటు పడిన నేటికాలపు విద్యార్థులకు చక్కటి ఆలోచనలు కలిగింపజేసి వారిలో ఉన్న ఊహలకు ఒక అక్షర రూపాన్ని కల్పించడం అనేది కత్తి మీద సాములాంటిది. అలాంటి ప్రయత్నాన్ని రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చేశారు .వారిని నిరంతరం చైతన్య పరుస్తూ వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసే ప్రయత్నం చేశాడు సీనియర్ తెలుగు పండితులు నరేష్ చారి గారు. తన సంపాదకత్వంలో పిల్లల నుండి కవితలు రాయించి తొలి కవితా సంకలనంగా పాఠకుల ముందుకు వచ్చినటువంటి బడి పిల్లల కవిత్వమే ఈ 'వెలుగు రేఖలు'. మెదక్ జిల్లా, కొల్చారం మండలం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల _ రంగంపేట విద్యార్థులు సామాన్యమైన వారు కావచ్చు, కానీ అక్కడ వెలిసిన అక్షర జ్యోతులు అసామాన్యమైనవి. ఆ పాఠశాల విద్యార్థులు తమ కలాలకు పదును పెట్టి, మనసులోని భావాలను అక్షర రూపంలోకి మార్చి తెలుగు భాషా ఉపాధ్యాయులు కవి సహృదయులైన నరేష్‌చారి గారి సంపాదకత్వంలో 'వెలుగు రేఖలు' అనే కవితా సంకల్పాన్ని మన ముందుకు తెచ్చారు. మట్టిలో మాణిక్యాల్లాంటి ఈ విద్యార్థులు ప్రకృతిని, అమ్మ ప్రేమను, సామాజిక అంశాలను తమదైన శైలిలో ''150 కవితల'' ద్వారా ఆవిష్కరించారు. ఈ పుస్తకంలోని ప్రతి పేజీ ఒక కొత్త ఆలోచనకు పునాది. రేపటి సమాజానికి దిక్సూచిగా నిలిచే ఈ చిన్నారి కవుల ప్రయత్నం నిజంగా అభినందనీయం. ఈ 'వెలుగు రేఖలు' ప్రతి పాఠకుడి గుండెల్లో ఒక కొత్త ఆశను నింపుతాయి. పాఠశాలను ఒక రాజ్యానిగా, గురువులను రాజ్యాన్ని పరిపాలించే రాజుగా, రాజ్యంలోని గ్రామంగా తరగతి

ధర ₹ 200
పేజీలు 202

ప్రతులకు
ఎన్. నరేశ్ చారి,
సిద్దిపేట
9701334516



గదిని పోలుస్తూ, పదవ తరగతి చదువుతున్న చిన్నారి భవశ్రీ ''మా తరగతి గది' అనే కవిత్వంలో వర్ణించిన తీరు అమోఘం. ''కొన్ని తరగతి గదులు తోటలోని మొగ్గలు అయితే మా తరగతి గది మాత్రం వికసించిన కుసుమం'' అని చెప్పింది భవశ్రీ మరో బాల రచయిత్రి కుమ్మరి అక్షయ పదవ తరగతి విద్యార్థి తెలంగాణ ప్రాంతపు యాస , గోసలను ,భాషలను, ఆచార వ్యవహారాలను గురించిన తీరు చాలా బాగుంది. "నేను తెలంగాణలో మాకు భాషా అంటే అభిమానం మా ప్రాణం ఉన్నదే గీ యాసలో ఉన్నది. మాకు గుర్తింపు ఇచ్చిందే గీ యాస " అంటూ ప్రాంతీయ ప్రత్యేకతను చిన్నారి తెలియజెప్పే ప్రయత్నం చేసింది.మరో చిన్నారి ''కుమ్మరి పూజ'' బాల్యపు జ్ఞాపకాలను మధుర స్థితిలో చక్కగా నిర్మించిన తీరు బహు బాగున్నది. ''బాల్యం అంటే మాకు జ్ఞాపకాల కుప్ప మరువని స్నేహితులు మర్చిపోలేని సంఘటన'' అంటూ బాల రచయిత్రి వివరించింది. మరో చిచ్చర పిడుగు పదవ తరగతి చదుతున్న 'స్నేహ' పుస్తకాన్ని మించిన స్నేహితుడు లేడు అంటూ "ఉత్తమ పుస్తకం" గొప్పతనాన్ని పుస్తకం అనే కవిత్వంలో వివరంగా తెలియజేసింది. ''పుస్తకాన్ని చదివితే అది ఎన్నెన్నో కొత్త కొత్త విషయాలను తెలుపుతుందని'' వివరించింది.చెరువు ఊరికి తొలకరి మెట్టు . ఊరికి అందాన్ని ఇచ్చేది చెరువు అంటూ శివలక్ష్మి ఆరవ తరగతి చిన్నారి "చెరువు" కవిత్వంలో చెరువుకు గ్రామానికి ఉన్న సంబంధాన్ని చక్కగా వివరించారు. వీరిని ఎల్లవేళలా ప్రోత్సహిస్తున్నటువంటి భాషా ఉపాధ్యాయులు నరేశ్ చారి గారు అభినందనీయులు . అంతేకాకుండా ''ఆ రోజులే బాగున్నాయంటూ'' చక్కటి శీర్షికతో భాషోపాధ్యాయురాలు బిల్ల నాగరాణి గారు తన కవితలో వివరించారు. మరో భ తెలుగు పండితురాలు మామిడిపల్లి గిరిజ ''జీవన గమనం'' గురించి జీవిస్తూ రాసిన తీరు ఆద్యంతం ఆసక్తికరంగా ఉంది. చివరలో విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఒక కవిగా, పాటల రచయిత గా విద్యార్థులలో ఆలోచనలను తట్టి లేపుతున్న సంపాదకులైన భాషోపాధ్యాయులు నరేష్‌చారి గారు తమ పాఠశాల విద్యార్థులు వెలుగులను విరజిమ్మే"వెలుగు రేఖలు"అని విద్యార్థులకు మంచి సందేశం అంద జేశారు. ఈ కవితలలో విద్యార్థులు అన్ని అంశాలనుస్పృశిస్తూ సమాజానికి మంచి సందేశాన్ని అందించారు. విద్యార్థుల నుండి ఇలాంటి మరెన్నో కవితలు జాలివారాలని కోరుకుంటూ సంపాదకు చిన్నారులకు రంగంపేట పాఠశాల శుభాకాంక్షలు తెలియజేద్దాం . పుస్తక ముఖచిత్రం అందంగా ఆకర్షణ గా తీర్చిదిద్దబడింది.

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలరు. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
99121 99844

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక

- సంగారెడ్డిలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి , మార్చి 15 : పవిత్రమైన రంజాన్ మాసం సోదరభావం, సహనం, పరస్పర గౌరవానికి ప్రతీక అని రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరుల కోసం ఆదివారం సంగారెడ్డి పట్టణంలోని మిలాద్ గ్రౌండ్లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి లు పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సురేష్ షెట్కర్, టీజీఐసీ చైర్పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రంజాన్ మాసం ప్రేమ, శాంతి, సహకారం పెంపొందించే పవిత్రమైన కాలమని అన్నారు. ఉపవాస దీక్ష ద్వారా మనసును పవిత్రం చేసుకోవడం, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం ఈ పండుగ ప్రత్యేకత అని తెలిపారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ మైనారిటీల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ముస్లిం సోదరుల అభ్యున్నతికి విద్య, ఉపాధి, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. సమాజంలో శాంతి, సామరస్యాలు నెలకొల్పడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి మాట్లాడుతూ రంజాన్ పండుగ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించే గొప్ప పండుగ అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం అన్ని మతాలు, వర్గాలు కలిసి జీవించే సంస్కృతికి నిలయమని తెలిపారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ రాష్ట్రంలో శాంతి, అభివృద్ధి కొనసాగాలని ఆకాంక్షించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉపవాసం ద్వారా ఆత్మశుద్ధి సాధించడం, పేదలకు దానం చేయడం వంటి గొప్ప విలువలను రంజాన్ మాసం గుర్తు చేస్తుందని అన్నారు. సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయుక్తమని తెలిపారు. అనంతరం ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా, మంత్రులు మరియు ఇతర ప్రజాప్రతినిధులు ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

250 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

- 2.34 ఎకరాల ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 15: రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం అత్తాపూర్‌లోని రాంబాగ్ సర్వే నంబరు 354/1, 354/2, 354/3లలో 2.34 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. దీని విలువ రూ. 250 కోట్ల వరకూ ఉంటుందని అంచనా. చుట్టూ దేవాలయాలు.. మధ్యలో ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమికి ఆనుకుని సిక్కులకు సంబంధించిన సమాధి ఉంది. ఒక వైపు దేవాలయాలకు కేటాయించాలని, మరో వర్గం సిక్కులకు ఇవ్వాలని స్థానికంగా ఎప్పటి నుంచో వివాదం నెలకొని ఉంది. ఎవరికి వారు తమదంటూ వాదిస్తూ వచ్చారు. ఇటీవల సిక్కులు తమకు ఈ భూమిని కేటాయించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ స్థలం విషయంపై సరైన నిర్ణయం తీసుకోవాలని జనవరి నెల 29న జిల్లా కలెక్టర్‌ను హైకోర్టు ఆదేశించింది. ఇందుకుగాను 3 నెలల సమయం ఇచ్చింది. ఈ లోగా సిక్కు మతస్తులు 2.34 ఎకరాల చుట్టూ టిన్ షీట్లతో ప్రహరీ నిర్మించి వారి ఆధీనంలోకి తీసుకున్నారు. దీంతో వివాదం తలెత్తింది. ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది.

హైడ్రా కమిషనర్ పరిశీలన

మీడియాలో వచ్చిన కథనాలతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇటీవల ఆ స్థలాన్ని పరిశీలించారు. ఇరు వర్గాలతో మాట్లాడారు. సంబంధిత పత్రాలను పరిశీలించారు. రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ భూమిగా నిర్ధారించారు. ఫెన్సింగ్ వేసి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం టిన్ షీట్లతో వేసిన ప్రహరీని తొలగించారు. ఆ వెంటనే 2.34 ఎకరాల చుట్టూ ఫెన్సింగ్ వేశారు. ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేశారు. సిక్కుల సమాధి ఉన్న స్థలం 366 గజాల స్థలాన్ని వదిలిపెట్టి మిగతా భూమి చుట్టూ ఫెన్సింగ్ శారు. దీంతో సమస్య పరిష్కారమైంది.

ప్రొఫెసర్ లింగమూర్తి మృతి విద్యారంగానికి తీరని లోటు

ప్రతిపక్షం, హైదరాబాద్, మార్చి 15: ప్రముఖ విద్యావేత్త కాకతీయ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నాగిశెట్టి లింగమూర్తి మృతి విద్యా రంగానికి తీరని లోటు అని జన జాగృతి కళా సమితి అధ్యక్షుడు ముక్కెర సంపత్ కుమార్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అక్కన్నపేట మండల అధ్యక్షుడు గంగాధరి రాజయ్యలు ఆవేదన వ్యక్తం చేశారు. అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన నాగిశెట్టి లింగమూర్తి అనారోగ్యంతో శనివారం మృతిచెందగా ఆదివారం నాడు హనుమకొండలో అంత్యక్రియలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంపత్, రాజయ్యలు విలేకరులతో మాట్లాడుతూ లింగమూర్తి మారుమూల ప్రాంతంలో పుట్టినప్పటికీ ఉన్నతమైన చదువులు చదివి ఆదర్శంగా నిలిచాడని అన్నారు. పేద మధ్యతరతి విద్యార్థులకు విద్యా రంగంలో ఎంతో సహకరించాడని పేర్కొన్నారు. తమ గ్రామంలో పుట్టిన వ్యక్తి విశ్వవిద్యాలయానికి ఉప కులపతిగా ఎదగడం ఎంతో గర్వకారణమని అన్నారు. ఆయన మృతి చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన స్ఫూర్తితో నేటి విద్యార్థులు ఉన్నత విద్యను ఆర్జించాలని సూచించారు.

వివాహానికి రూ.10వేల ఆర్థిక సాయం

ప్రతిపక్షం,మొయినాబాద్, మార్చి 15 : మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామానికి చెందిన బురాన్ అశోక్ కుమార్తె వివాహానికి గ్రామ సర్పంచ్ సంపూర్ణ రాములు రూ.10,000 ఆర్థిక సాయం అందించారు. సామాజిక బాధ్యతగా ముందుకు వచ్చి ఈ సహాయం చేయడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు , గ్రామస్తులు పాల్గొన్నారు

జనగణన సమర్థవంతంగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ విక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, మార్చ్ 15: 2026 సెన్సస్-2027 కు సంబంధించిన దశ-1 గృహ జాబితా, గృహ గణన కార్యక్రమం నిర్వహణకు సంబంధించి జిల్లా స్థాయి/సబ్ డివిజన్ స్థాయి/ఛార్జ్ స్థాయి అధికారులకు ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ వి.విక్టర్ ఆధ్వర్యం లో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ సూచనల మేరకు రాష్ట్రవ్యాప్తంగా గృహ జాబితా, గృహ గణన కార్యక్రమం 2026 మే 11 నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎన్యూమరేటర్లు , సూపర్‌వైజర్ల కు శిక్షణ సందర్భంగా జిల్లా/ఉపజిల్లా అధికారులు, ఛార్జ్ అధికారులు, ఛార్జ్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లు , ఫీల్డ్ ట్రైనర్లు వంటి జనాభా గణన 2027 విధులకు కేటాయించిన అధికారులకు ముందస్తుగా శిక్షణ ఇవ్వడం జరుగుతున్నదని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని జిల్లా , సబ్‌డివిజనల్ అధికారులు, ఛార్జ్ అధికారులకు లెవల్-1 శిక్షణా కార్యక్రమం 15.03.2026 నుండి 17.03.2026 వరకు నిర్వహించడం జరుగుతుందని ఈ శిక్షణ కార్యక్రమం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 3 రోజులపాటు 15 నుండి 17 వరకు ప్రతి రోజు ఉదయం 9:30 గంటల నుండి సాయంత్రం 6:00 గంటల వరకు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అదనపు జిల్లా సెన్సస్ అధికారి, సబ్‌డివిజనల్ జిల్లా సెన్సస్ అధికారులు, ఛార్జ్ సెన్సస్ అధికారులు , అదనపు ఛార్జ్ సెన్సస్ అధికారులుగా నియమించబడిన అధికారులు ఈ శిక్షణలో దిశా నిర్దేశం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జనాభా లెక్కల గణన ప్రక్రియ ను సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు , మౌలిక వసతుల ప్రణాళికలను ఖచ్చితమైన జనగణన గణాంకాలు పునాదిగా ఉంటాయని తెలిపారు. జనాభా గణన ను సాంకేతిక పరిజ్ఞానంతో డిజిటల్ పద్ధతిలో పారదర్శకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 33 అంశాలపై సమగ్ర సమాచారం సేకరించబడుతుందని మొదటి దశలో గృహాలు, భవనాలు, కుటుంబ వివరాలు, రెండో దశలో వ్యక్తిగత వివరాలు నమోదు చేస్తారని తెలిపారు. అధికారులు, ఎన్యూమరేటర్లు సమన్వయంతో పనిచేసి నిర్ణీత కాలపరిమితి లో జనాభా గణన ను పూర్తి చేయాలని ఆయన సూచించారు. శిక్షణలో అదనపు కలెక్టర్ మధుమోహన్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, సీఈఓ చందర్, ఆర్డీవో వీణ, సీపీవో రఘునందన్, జిల్లాలోని సంబంధిత అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ఇతర సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి పెద్దపీట

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి.
- పటాన్చెరులో ముస్లింలకు ఈద్ తోఫాల పంపిణీ

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 15 : పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని ముస్లిం మైనార్టీల సంక్షేమానికి, ఆర్థిక అభ్యున్నతికి పెద్దపీట వేస్తున్నామని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. రంజాన్ పర్వదినం పురస్కరించుకొని ఆదివారం పటాన్ చెరు పట్టణం లోని వివిధ మసీదుల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రభుత్వం అందించిన రంజాన్ కానుకలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన అనంతరం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ముస్లింల ఆర్థిక అభివృద్ధికి పెద్దపీట వేశారని తెలిపారు. రంజాన్ పండుగ రోజున నిరుపేద ముస్లింలు ఆనందోత్సాహాల మధ్య పండుగను నిర్వహించుకోవాలన్న లక్ష్యంతోనే కెసిఆర్ ప్రభుత్వం రంజాన్ కానుకల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు.

పరిశుభ్రతలో పంచాయతీ కార్మికుల పాత్ర వెలకట్టలేనిది

- సర్పంచ్ వెంకటేష్ గౌడ్

ప్రతిపక్షం,మొయినాబాద్, మార్చి 15: గ్రామ పరిశుభ్రతలో పంచాయతీ కార్మికుల పాత్ర వెలకట్టలేనిదని సర్పంచ్ వెంకటేష్‌గౌడ్ అన్నారు. "ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కష్టపడుతున్న పారిశుద్ధ్య కార్మికులను శాలువాలు కప్పి అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... గ్రామం స్వచ్ఛంగా ఉండేందుకు కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారని, వారి సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధిలో వారి పాత్ర ఎంతో ముఖ్యమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బాకారం జాగీర్ 4వ వార్డు సభ్యుడు బండి అనిల్ ముదిరాజ్, పంచాయతీ కార్యదర్శి శివశంకర్, సుభాష్ రెడ్డి, 10వ వార్డు సభ్యుడు మాడి దినేష్ రెడ్డి, అలిగెని భిక్షపతి గౌడ్, కొండకళ్ల మహేందర్, కొండకళ్ల రవి, కొండకళ్ల శ్రీకాంత్, రాయణోళ్ల ఉపేందర్ యాదవ్, కొంతం నగేష్‌రెడ్డి పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

- ప్రెస్ క్లబ్ లో ఇఫ్తార్ విందు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్. మార్చి 15 : మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగని జామతే ఇస్లాం ఆర్గనైజేషన్ ప్రతినిధి హుస్సేన్ అన్నారు. ఆదివారం రంజాన్ పండగను పురస్కరించుకొని నిజామాబాద్ నగరంలోని ప్రెస్ క్లబ్ లో ముస్లిం జర్నలిస్టులకు ఇఫ్తార్ విందును ప్రెస్ క్లబ్ కార్యవర్గం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పంచారెడ్డి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి సుభాష్ లు మాట్లాడుతూ.. ప్రెస్ క్లబ్ లో ప్రతి సంవత్సరం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేస్తామని, మత సమరస్యానికి ప్రత్యేకగా పండగను జరుపుకుంటామన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. జమాతే ఇస్లామిక్ ప్రతినిధి షేక్ హుస్సేన్ మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రత్యేకత జరుపుకునే రంజాన్ పండుగను పురస్కరించుకొని ప్రెస్ క్లబ్ లో ఇఫ్తార్ విందు జరపడం గొప్ప విషయమన్నారు. ప్రతి సంవత్సరం జర్నలిస్టు మిత్రులకు ఈ ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయడం గొప్ప విషయం అన్నారు. పవిత్ర రంజాన్ రోజుల్లో ఉపవాస దీక్షతో ఉండే జర్నలిస్టు సోదరులు ఆయురారోగ్యాలతో ఉండి అల్లా దీవెనలు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం సామూహికంగా ప్రార్థనలు చేశారు. నిజామాబాద్ ప్రెస్ క్లబ్లో జరిగిన ఇఫ్తార్ విందుకు సహాయ సహకారాలు అందించిన వెల్నెస్ ఆస్పత్రి డైరెక్టర్లు అసత్ ఖాన్, సుమన్ గౌడ్, వివేకానంద రెడ్డి, మేనేజర్ వినోద్ కుమార్ లకు ప్రెస్ క్లబ్ పక్షాన నిజామాబాద్ ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలోఆర్గనైజింగ్ ప్రెస్ క్లబ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాజు, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు గోవిందరాజ్, బైస సంగీత, ఈ సి సభ్యులు రవి చరణ్ రెడ్డి, భూమేష్, పప్పా ఖాన్, హైమద్ అలీ ఖాన్, ఎండి గౌస్, మాజీత్, అసద్, నయీమ్ క, ముకిత్ పారుకి, సయ్యద్ ఉస్మాన్, హాసిన్ అలీ, అన్వర్ ఖాన్, ఎంపీజే అలీమ్ కమార్, అజ్మత్ ఖాన్, జమాల్పూర్ గణేష్, రామ్ దయానంద్, అరవింద్ బాలాజీ, , శ్రీధర్, రాజేష్ తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

డెస్క్ జర్నలిస్టుల గొంతుక డీజేఎస్

- సీఎం నోటివెంట డెస్క్ జర్నలిస్టుల ప్రస్తావన మన ఐక్యతకు నిదర్శనం: ఉపేందర్
- డీజేఎస్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక
- హెల్త్ కార్డులు, ఇండ్ల జాగలపై ప్రభుత్వ పెద్దలను కలవాలని తీర్మానం

ప్రతిపక్షం, హైదరాబాద్, మార్చి 15: డెస్క్ జర్నలిస్టుల గొంతుకగా, వారి సంక్షేమం, ప్రయోజనాల కోసం డెస్క్ జర్నలిస్టుల సంఘం(డీజేఎస్) ఏర్పడిందని డీజేఎస్ ప్రెసిడెంట్ బాదిని ఉపేందర్ స్పష్టం చేశారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి.. డెస్క్ జర్నలిస్టుల ప్రస్తావన తేవడం మనందరి ఐక్య పోరాటానికి దక్కిన గుర్తింపని పేర్కొన్నారు. ఇకముందు కూడా ఇదే యూనిటీతో మన సమస్యల పరిష్కారానికి కృషిచేద్దామని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన డీజేఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఉపేందర్ మాట్లాడారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, వెబ్ మీడియాల్లో పనిచేస్తున్న డెస్క్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డుల పెంపు, జిల్లా అక్రెడిటేషన్ కమిటీల్లో డెస్క్ జర్నలిస్టులకు చోటు, మొత్తం అక్రెడిటేషన్లలో మహిళలకు 33శాతం కోటాపై డీజేఎస్ చేసిన వినతులు, విజ్ఞప్తులు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు తెలిసిందన్నారు. దీనిపై ప్రభుత్వం నుంచి అనుకూల నిర్ణయం రాకపోతే భవిష్యత్ పోరాటాలు మరింత ఉధృతం చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం, డీజేఎస్ రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. డెస్క్ జర్నలిస్ట్స్ సంఘం ప్రెసిడెంట్ గా బాదిని ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా రాజారాం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సోమనర్సయ్య(వరంగల్), ట్రెజరర్‌గా వెంకటరమణ, జాయింట్ సెక్రటరీలుగా కనపర్తి రమేశ్, కాంకూరి వెంకటేశ్వర్(ఖమ్మం), భీంరావు(నిజామాబాద్), కమిటీ మెంబర్లుగా గరీమ, పద్మ, సత్యప్రసాద్ ఎన్నికయ్యారు. జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు, ఇండ్ల జాగల విషయంలో ప్రభుత్వ పెద్దలు, సంబంధిత అధికారులకు వినతులు సమర్పించాలని డీజేఎస్ తీర్మానించింది. సమావేశంలో నరేందర్, సదానందం, లింబాద్రి, అశోక్, రమేశ్ కుమార్, సత్యం, జిల్లా డెస్క్ జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ డ్రగ్స్ కేసులోకి నన్ను లాగితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుంది. ఎలాంటి టెస్ట్‌కైనా నేను సిద్ధం. డ్రగ్స్ కేసు తెరపైకి వచ్చిన ప్రతీసారి బీఆర్ఎస్ పార్టీని లాగడం దారుణం. నేను, మా పార్టీ డ్రగ్స్ వాడకానికి పూర్తి వ్యతిరేకం.
- బీఆర్ఎస్‌నేత కేటీఆర్

ప్రాంతీయం

రిటైర్డ్ ఉద్యోగులను రేవంత్ రెడ్డి
రోడ్ల మీదకు తెచ్చారు

- బడా కాంట్రాక్టర్లకు ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలకు ఖర్చు చేస్తున్నారూ కానీ ఉద్యోగులకు మాత్రం బెనిఫిట్స్ ఇవ్వడం లేదు
- సిద్దిపేటలో రిటైర్డ్ ఉద్యోగుల నిరాహార దీక్షకు హరీష్ రావు మద్దతు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 15: 35 సంవత్సరాలు కష్టపడి పనిచేసి రిటైర్ అయిన ప్రభుత్వ ఉద్యోగులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోడ్ల మీదకు తీసుకువచ్చారని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు.సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు మద్దతుగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఎన్నికల ముందు పెండింగ్ డీఏలు, బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయడం లేదని విమర్శించారు.రిటైర్డ్ ఉద్యోగులు తమకు రావాల్సిన సుమారు పదివేల కోట్ల బకాయిలు ఇవ్వాలని అడుగుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. బడా కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లిస్తున్నారని, ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలకు ఖర్చు చేస్తున్నారని, కానీ ఉద్యోగులకు మాత్రం ఇవ్వడం లేదని ఆరోపించారు.రిటైర్డ్ పెన్షన్ బెనిఫిట్లు ఆలస్యం కావడంతో ఇప్పటికే 60 మంది మరణించారని, వారి మరణాలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయంలో రిటైర్ అయిన ఉద్యోగులకు నెల రోజుల్లోనే బెనిఫిట్లు చెల్లించామని ఆయన పేర్కొన్నారు.ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మూడు లక్షల కోట్ల బడ్జెట్ పెడుతుండగా, అందులో కనీసం పది వేల కోట్లను రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపులకు కేటాయించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. ఉద్యోగులు సంఘటితం అయి తమ హక్కుల కోసం పోరాటం కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు.

కేసీఆర్ హయాంలో
అంగన్‌వాడీలకు అత్యధికంగా వేతనాలు

- అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనాలు ఇవ్వాలి
- అంగన్‌వాడీల డిమాండ్లను అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం హరీశ్ రావు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 15: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు తమ న్యాయమైన డిమాండ్ల కోసం చేస్తున్న పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావు తెలిపారు. వారి సమస్యలను రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి ప్రభుత్వాన్ని నిలదీస్తామని భరోసా ఇచ్చారు. ఆదివారం సిద్దిపేట లోని తన క్యాంపు కార్యాలయంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ప్రతినిధులు హరీశ్ రావును కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని, తమ డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో అంగన్‌వాడీ టీచర్లకు రూ.18,000 కనీస వేతనం ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు కావొస్తున్నా ఆ హామీ అమలు కాలేదని అన్నారు. అంగన్‌వాడీ టీచర్ల కనీస వేతనం, ఉద్యోగ భద్రతపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ను ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం హయాంలో అంగన్‌వాడీలకు దేశంలోనే అత్యధికంగా వేతనాలు పెంచినట్లు గుర్తుచేశారు. ఆన్‌లైన్ రిపోర్టింగ్ కోసం అంగన్‌వాడీలకు కొత్త మొబైల్స్ ఇవ్వాలని, ఎన్ హెచ్ టి ఎస్ పోషణ్ ట్రాకర్ యాప్‌లలో ఉన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించి ఒకే యాప్‌గా తీసుకురావాలని సూచించారు. మార్కెట్లో పెరిగిన ధరలకు అనుగుణంగా ఆరోగ్య లక్ష్మి పథకం బిల్లుల బడ్జెట్ పెంచాలని, అంగన్‌వాడీలపై బీఎల్ఓ వంటి ఇతర శాఖల పనుల భారం మోపవద్దని ప్రభుత్వాన్ని కోరారు.అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఈ సందర్భంగా హరీశ్ రావు భరోసా ఇచ్చారు.

రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమం నిరంతర ప్రక్రియ

- అర్హులైన ప్రతి పేదకు సంక్షేమ పథకాలు
- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చి 15: అర్హులైన ప్రతి పేదకు కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు వర్తింపజేస్తుండగా, రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమం నిరంతర ప్రక్రియ ని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని క్యాసారంలో ఇందిరమ్మ గృహాన్ని లబ్ధిదారులతో కలిసి ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరీ చేస్తుండగా, ఆరు గ్యారెంటీలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ అవసరాలకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ సరఫరా, 500 కే వంట గ్యాస్ సిలిండర్ పంపిణీ, రేషన్ కార్డు మంజూరితో పాటు సన్న బియ్యం అందజేత తదితర పథకాలు వర్తింపజేస్తున్నట్లు గుర్తు చేశారు. ముఖ్యంగా గజ్వేల్ నియోజకవర్గానికి 35 వేల ఇండ్లను మంజూరు చేయగా, అందులో 80 శాతం మంది లబ్ధిదారుల ఇంటి నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నట్లు తెలిపారు. లబ్ధిదారుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని బిల్లులు చెల్లిస్తుండగా, ఇందులో ఎలాంటి మధ్య దళారీలు ఉండరని చెప్పారు. సొంత స్థలం ఉన్న పేదలు నేరుగా సంప్రదిస్తే ఇందిరమ్మ ఇల్లు మంజూరి చేస్తామని పేర్కొన్నారు. రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని 2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, సన్నధాన్యానికి 500 బోనస్, పేదలకు 10 లక్షల ఆరోగ్యశ్రీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ తదితర పథకాలు సీఎం నాయకత్వం లోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు నాయిని యాదగిరి, కొండల్ రెడ్డి, మహేష్, గుంటుకు శ్రీనివాస్, నక్క రాములు గౌడ్, నేత నాగరాజు, అభిషేక్ రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కొమురవెల్లిలో భక్తుల సందడి

- చివరి వారానికి భారీగా తరలి వచ్చిన భక్తులు.
- మల్లన్నకు మంత్రి కొండ సురేఖ ప్రత్యేక పూజలు.
- మల్లన్నను దర్శించుకున్న పలువురు ప్రముఖులు.

ప్రతిపక్షం, కొమురవెల్లి, మార్చి 15: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో జాతర బ్రహ్మోత్సవాలలో చివరి ఆదివారం అగ్నిగుండాలను తిలకించేందుకు భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయంలో సందడి నెలకొంది. కొమురవెల్లి మల్లికార్జునస్వామి జాతర బ్రహ్మోత్సవాలు గత మూడు నెలలుగా కొనసాగి ఆదివారం అర్ధరాత్రి ఆలయ తోటబావి వద్ద నిర్వహించే అగ్నిగుండాలతో ముగుస్తాయి. ఆదివారం చివరి వారం కావడంతో భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామికి మొక్కులు చెల్లించి దర్శించుకున్నారు. భక్తుల రాకతో ఆలయ పరిసరాలు మల్లన్న నామస్మరణతో మారుమోగాయి. స్వామి వారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో స్వామి వారి దర్శనానికి సుమారు 4 గంటల సమయం పట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు. కొమురవెల్లి మల్లికార్జునస్వామిని జబర్దస్త్ ప్రేమ్, సినీ నటుడు ముక్కు అవినాష్ కుటుంబ సమేతంగా మల్లికార్జునస్వామిని దర్శించుకుని పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు ఆలయ అధికారులు అర్చకులు స్వామి వారు లడ్డు ప్రసాదం అందజేసి ఘనంగా సన్మానించారు అనంతరం ఆయన మాట్లాడుతూ కొమురవెల్లి మల్లికార్జున స్వామి తమ ఇష్ట దైవమని ప్రతి యేట స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటామని అన్నారు. మల్లికార్జునస్వామి వారిజాతర బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టం అగ్నిగుండాలకు ఆలయఅధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మల్లన్నకు మంత్రి కొండ సురేఖ ప్రత్యేక పూజలు..

కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు అధికారులు పూర్ణకుంభంతో ఆమెకు ఘన స్వాగతం పలికారు అనంతరం మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయం ముఖ మండపంలో పట్నాలు వేసి వివిఐపి గెస్ట్ హౌస్ లో భోనాలు చెల్లించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ కొమురవెల్లి మల్లన్న స్వామి తమ ఇంటి ఇలావేల్పని ప్రతి సంవత్సరం స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కొమురవెల్లి మల్లన్న ఆలయం వద్ద ఎలాంటి అభివృద్ధి జరగలేదని, అభివృద్ధి కేవలం ప్రతిపాదనలు మాత్రమే చేశారని అన్నారు. మల్లన్న ఆలయంలో 50 గదులు, 100 గదులు, క్యూ కాంప్లెక్స్ నిర్మాణలతో పాటు ఆలయంలో సిబ్బంది కొరత లేకుండా చూస్తామని అన్నారు. మల్లన్న ఆలయాన్ని దాతల సహాయంతో దేవాదాయ శాఖ నిధులు వెచ్చించి ఆలయాన్ని అన్ని రకాల అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని అన్నారు. కొమురవెల్లిలో రానున్న రోజుల్లో ఆలయం వద్ద మాస్టర్ ప్లాన్ అమలు చేసి ఆలయనికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ గంగం నరసింహ్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, ఈవో కృష్ణ ప్రసాద్, ఏఈఓ బుద్ధి శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తలు బొచ్చు ఎల్లయ్య, వెలుగుల మల్లేశం, కొమురయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై లక్ష్మీనరసింహస్వామి

ప్రతిపక్షం, గజ్వేల్ (వర్గల్), మార్చ్15: వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగిన స్వామివారి కల్యాణోత్సవం తర్వాత ప్రధానంగా జరిగే గరుడోత్సవం, రథోత్సవం కార్యక్రమంలో శనివారం నాడు రాత్రి జరిగిన "గరుడోత్సవ" కార్యక్రమం అత్యంత వైభవంగా ఆలయ నిర్వాహకులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి పెద్ద గరుడ వాహనంపై లక్ష్మీ సమేతుడై భక్తులకు దర్శనం ఇచ్చారు. కార్యక్రమంలో చైర్మన్ రవీందర్ గుప్త,ఆలయ కార్య నిర్వహణ అధికారి బి రంగాచారి, సభ్యులు, నాయకం శ్రీనివాస్, చందా నాగరాజు, గాలి కిష్టయ్య కొత్తపల్లి శ్రీనివాస్, కర్రే పద్మ వెంకటేష్, ఆలయ సిబ్బంది నాచారం ఉపసర్పంచ్ భూస వినయ్ తోపాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మెడ్ వన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, మార్చ్ 15: మందపల్లి గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో మెడ్ వన్ హాస్పిటల్, కొంపల్లి వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టూ టౌన్ సి.ఐ ఉపేందర్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామ ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందించారు. ఈ వైద్య శిబిరంలో అనేక మంది గ్రామస్తులు పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఇలాంటి శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని ముఖ్య అతిథులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వెంకట్ రెడ్డి , గ్రామ పెద్దలు, యువకులు , స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

ప్రతిపక్షం, దుబ్బాక, మార్చి 15: దుబ్బాక మండలం లోని పర్షరాంనగర్‌లోని శ్రీ పెద్దమ్మ తల్లిని ఆదివారం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా ఎల్లప్పుడూ సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ , దుబ్బాకసర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు పర్స దేవరాజు , పలువురు ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు నాయకులు, కార్యకర్తలు భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలను
పరామర్శించిన పద్మదేవేందర్ రెడ్డి

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చి 15: మెదక్ జిల్లా రాంపూర్ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. హవేలీఘనపూర్ మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన తండ్రి -కుమారుడు అమృత్ గౌడ్,రిషి వర్ధన్ గౌడ్, అలాగే బోగూడ భూపతిపూర్ గ్రామానికి చెందిన సాయ గౌడ్ ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు.ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు యం. పద్మదేవేందర్ రెడ్డి ఆదివారం బూరుగుపల్లి గ్రామానికి చేరుకుని అమృత్ గౌడ్, రిషి వర్ధన్ గౌడ్ పార్థివ దేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.ఒకే ప్రమాదంలో తండ్రి, కుమారుడు,అల్లుడు ప్రాణాలు కోల్పోవడం చాలా దురదృష్టకరమని తెలిపారు.ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొంటూ బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అదేవిధంగా బోగూడ భూపతిపూర్ గ్రామానికి చెందిన గోకని సాయ గౌడ్ మృతి చెందడం ఈ ఘటన పట్ల ఆమె తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.సాయ గౌడ్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన భార్య, తల్లిని పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబ సభ్యుల బాధను చూసి పద్మ దేవేందర్ రెడ్డి కూడా భావోద్వేగానికి గురయ్యారు. రోడ్డు ప్రమాదంలో సాయ గౌడ్ మృతి చెందడం అత్యంత బాధాకరమని ఆమె పేర్కొన్నారు. అనంతరం సాయ గౌడ్ కుటుంబానికి రూ.10,000, అలాగే బూరుగుపల్లి అమృత్ గౌడ్ కుటుంబానికి రూ.10,000 చొప్పున మొత్తం రూ.20,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో బూరుగుపల్లి మాజీ సర్పంచ్ చెన్న గౌడ్, హవేలీఘనపూర్ సర్పంచ్ సాయిలు, నాయకులు బాలరాజ్, రవీందర్ గౌడ్, సాప. సాయిలు, రాంచంద్రం రెడ్డి, రాఘవ రెడ్డి, జీవన్ రెడ్డి, యాదగిరి, లక్ష్మిపతి, అరవింద్, కుమార్, సంతూ, శ్రీశైలం, రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నది

- రిజర్వేషన్ ను పెంచుతామని కేసీఆర్ ముస్లిం ప్రజలను మోసం చేశారు
- అర్హులైన ముస్లింలకు త్వరలోనే స్కూటీ, కుట్టు మిషిన్ ను అందజేస్తాం
- సిద్ధిపేట లోని విపంచి ఆడిటోరియం లో నిరుపేద ముస్లింలకు రంజాన్ తోఫాల పంపిణీ
- సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జ్ పూజల హరికృష్ణ,పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 15: మైనార్టీల సంక్షేమం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నరు అని సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జ్ పూజల హరికృష్ణ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్ధిపేటలో ఆదివారం విపంచి ఆడిటోరియంలో రంజాన్ పండుగ సందర్భంగా నిరుపేద ముస్లింలకు రంజాన్ తోఫాలను సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జ్ పూజల హరికృష్ణ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జ్ పూజల హరికృష్ణ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి కేంద్రంలో మోదీ మైనారిటీలను పట్టించుకున్న పాపానా పోవడం లేదు అని అన్నారు. రిజర్వేషన్ ను పెంచుతామని చెప్పి 10 సంవత్సరాలు కెసిఆర్ ముస్లిం ప్రజలను మోసం చేశారు అని అన్నారు. మన దేశంలో గత కాంగ్రెస్ ప్రభుత్వంలో అమలు చేసిన ముస్లిం రిజర్వేషన్ ఇప్పటికీ కొనసాగుతున్నది అని అన్నారు. అప్పటి నుండి ఇప్పటి వరకు రాష్ట్రం దేశం లో కాంగ్రెస్ ప్రభుత్వం తప్ప మిగిలిన ఏ ప్రభుత్వం కూడా మైనారిటీల అభివృద్ధికి నోచుకోలేదు అని అన్నారు. మైనారిటీలు అభివృద్ధి చెందాలంటే కేంద్రంలో రాహుల్ గాంధీ ప్రధాని కావాలి అని అన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితే దేశంలోని అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతాయి అని అన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ వల్లే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది అని అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మైనార్టీ ల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు అని అన్నారు. అర్హులైన ముస్లింలకు త్వరలోనే స్కూటీలను అందజేస్తాం అని సిద్ధిపేట్ ముస్లిం ప్రజలకు మైనార్టీ కార్పొరేషన్ లో ప్రవేశ పెట్టిన పథకాలను అన్నీ అందజేస్తాం అని అన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలు అభివృద్ధి చెందాలి అంటే కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని మరో 10 సంవత్సరాలు ప్రజలు ఆదరించి ఆశీర్వదించాలీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పయ్యావుల ఎల్లం రియాజుద్దీన్. పూజల గోపి మీసం మహేందర్ షాబుద్దీన్ వహాబ్ గయాజుద్దీన్ రషద్. హర్షద్ విజయ్ డానియల్ అజ్మత్ మున్న సలీం చెంది శ్రీనివాస్ బాబా. స్రవంతి మైపాల్ రెడ్డి చోటాస్మత్ దేశెట్టి నరేష్..మున్నా. తదితరులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

“

తమిళనాడులో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీతో పొత్తు ఉండబోదు. ఈ విషయంలో మీడియాలో వస్తున్న వార్తలంతా వదంతులే. ఇప్పటి వరకు టీవీకే పార్టీతో మేం అసలు చర్చలే జరపలేదు. బీజేపీ లీడర్ అన్నామలైతో నాకు ఎలాంటి విభేదాలు లేవు.
- ఏఐఏడీఎంకే జనరల్ సెక్రటరీ పళనిస్వామి

ఆరు రాష్ట్రాల్లో ఉప ఎన్నికలకు షెడ్యూల్

- ప్రకటించిన ఎన్నికల సంఘం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 15 : కేంద్ర ఎన్నికల సంఘం పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌తోపాటే మరో ఆరు రాష్ట్రాల్లో ఉప ఎన్నికలకు కూడా షెడ్యూల్‌ను విడుదల చేసింది. గుజరాత్, గోవా, కర్ణాటక, మహారాష్ట్ర, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల్లోని మొత్తం 8 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. గోవా, కర్ణాటక, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల్లో ఉప ఎన్నికలకు మార్చి 16న నోటిఫికేషన్ రిలీజ్ కానుంది. మార్చి 23 వరకు నామినేషన్‌లు స్వీకరించనున్నారు. మార్చి 24 స్క్రూటినీ నిర్వహిస్తారు. మార్చి 26 వరకు నామినేషన్‌ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. ఏప్రిల్ 9న పోలింగ్ జరుగుతుంది. ఇక మహారాష్ట్ర, గుజరాత్‌లో ఉపఎన్నికలకు మార్చి 30న నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఏప్రిల్ 6 వరకు నామినేషన్‌లు స్వీకరిస్తారు. ఏప్రిల్ 7న నామినేషన్‌ల స్క్రూటినీ చేస్తారు. నామినేషన్‌ల ఉపసంహరణకు ఏప్రిల్ 9 వరకు గడువు ఉంటుంది. ఏప్రిల్ 23న పోలింగ్ జరుగుతుంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతోపాటే ఉప ఎన్నికల ఫలితాలు కూడా మే 4న వెల్లడికానున్నాయి.

విశ్వ వీక్షణం

పరుగు ఆపండి.. ప్రశాంతతను వెతకండి!

డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ
9490754169

నేటి వేగవంతమైన ప్రపంచంలో, మనం అందరం ఏదో ఒక లక్ష్యం వైపు విరామం లేకుండా పరుగెత్తుకుంటూనే ఉన్నాం. డబ్బు సంపాదించడం, సామాజిక హోదాను పెంచుకోవడం, పేరు ప్రతిష్ఠలు సాధించడం, అత్యాధునిక భౌతిక సౌకర్యాలు సమకూర్చుకోవడం ఇవన్నీ మన జీవితపు అంతిమ లక్ష్యాలుగా మారిపోయాయి. కానీ ఈ నిరంతర పరుగులో, మనం ఒక ప్రాథమిక సత్యాన్ని విస్మరిస్తున్నామా? మనస్సు ప్రశాంతత అనే అత్యంత అమూల్యమైన, సహజమైన సంపదను ఎక్కడో దారిలో వదిలేస్తున్నామా? అనే ప్రశ్న ప్రతి ఒక్కరినీ వేధిస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) గణాంకాలను పరిశీలిస్తే విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 28 కోట్ల మందికి పైగా తీవ్రమైన మానసిక ఒత్తిడి మరియు ఆందోళనతో (Anxiety) బాధపడుతున్నారు. మన భారతదేశం విషయానికి వస్తే, ప్రతి పది మందిలో ఒకరు ఏదో ఒక రూపంలో మానసిక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ గణాంకాలు మనకు ఒక గట్టి హెచ్చరికను ఇస్తున్నాయి. మన తలసరి ఆదాయం పెరుగుతోంది, ఆస్తులు పెరుగుతున్నాయి, కానీ మన నిద్ర కరువవుతోంది, మానసిక శాంతి క్రమంగా ఆవిరైపోతోంది.మనిషి జీవించడానికి డబ్బు అవసరం అనే విషయంలో ఎటువంటి సందేహం లేదు. ఆహారం, వస్త్రం, గూడు వంటి కనీస అవసరాల నుండి, ఉన్నత చదువులు, మెరుగైన వైద్యం వరకు ప్రతిదానికీ ఆర్థిక వనరులు కావాల్సిందే. అయితే, ఇక్కడే ఒక సూక్ష్మమైన వ్యత్యాసాన్ని మనం గమనించాలి. డబ్బు ఒక సాధనం మాత్రమే కావాలి తప్ప, అదే జీవితపు సాధ్యం (Goal) కాకూడదు. నేడు చాలామంది కోట్లాది రూపాయల సామ్రాజ్యాలను నిర్మించినా, రాత్రి పూట ప్రశాంతంగా కన్ను మూయలేక నిద్రమాత్రలపై ఆధారపడుతున్నారు. చుట్టూ కాపలాదారులు ఉన్నా, మనసు చుట్టూ అల్లుకున్న ఆందోళనల నుండి తప్పించుకోలేకపోతున్నారు. ముంబైకి చెందిన రాజేష్ అనే పారిశ్రామికవేత్త కథ ఇందుకు ఒక నిలువుటద్దం. ముప్పయ్యేళ్ళకే ఆయన ఒక భారీ కంపెనీకి అధిపతి అయ్యారు. ఖరీదైన విల్లాలు, లగ్జరీ కార్లు, విదేశీ ప్రయాణాలు ఆయనకు అలవాటు. కానీ, రాత్రి మూడు గంటలకే మెలకువ వచ్చి, తన వ్యాపార ప్రత్యర్థుల గురించి, మార్కెట్ ఒడిదుడుకుల గురించి ఆలోచిస్తూ గంటల తరబడి మంచంపై దొర్లుతూ ఉంటారు. ఇన్ని కోట్లు ఉన్నా, ఆయన ఒక సామాన్యుడిలా ప్రశాంతంగా నిద్రపోలేకపోతున్నారు. మరోవైపు, అదే నగరంలో ఒక చిన్న పుస్తక దుకాణాన్ని నడుపుతున్న రమేష్ జీవితం చూడండి. ఆయనకు విలాసవంతమైన ఆస్తులు లేవు, కానీ ఆయన ముఖంలో ఒక వెలుగు ఉంటుంది. సాయంత్రం వేళ తన పిల్లలతో ఆడుకోవడం, ఇంట్లోని చిన్న తోటలో మొక్కలకు నీళ్లు పోయడం, రాత్రి కుటుంబ సభ్యులందరితో కలిసి కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేయడం ఇవే ఆయనకు ప్రపంచంలోని అతిపెద్ద సంపదలు. రాత్రి పడుకోగానే గాఢ నిద్ర పడుతుంది. ఉదయాన్నే ఒక కొత్త ఉత్సాహంతో మేల్కొంటారు. ఈ ఇద్దరిలో అసలైన సంపన్నుడు ఎవరంటే, నిస్సందేహంగా రమేష్ అని మనం చెప్పక తప్పదు. ఆధునిక వైద్య శాస్త్రం ఇప్పుడు సైకోసోమాటిక్ (Psychosomatic) వ్యాధుల గురించి గట్టిగా మాట్లాడుతోంది. అంటే మనస్సులో పుట్టే ఒత్తిడి శరీరంలో వ్యాధులుగా మారుతుంది. దీర్ఘకాలిక మానసిక ఒత్తిడి వల్ల రక్తపోటు, మధుమేహం, గుండెపోటు వంటి ప్రమాదకర వ్యాధులు చుట్టుముడుతున్నాయి. హార్వర్డ్ మెడికల్ స్కూల్ నిర్వహించిన సుదీర్ఘ అధ్యయనంలో ఒక ఆసక్తికరమైన విషయం బయటపడింది. ఎవరైతే మానసిక ప్రశాంతతతో, తృప్తితో జీవిస్తారో, వారు నిరంతరం ఒత్తిడికి లోనయ్యే వారి కంటే సగటున ఏడు నుండి పది సంవత్సరాలు ఎక్కువ కాలం జీవిస్తారని తేలింది. మనం రోజువారీ జీవితంలో చిన్న చిన్న విషయాలకు ఇచ్చే ప్రాధాన్యతను గమనించండి. ట్రాఫిక్ జామ్ అయిందని చిరాకు పడటం, సోషల్ మీడియాలో మనకంటే ఇతరులు గొప్పగా కనిపిస్తున్నారని ఈర్ష్య పడటం, పక్కింటి వారు కొత్త వస్తువు కొంటే మనశ్శాంతి కోల్పోవడం ఇవన్నీ మన శక్తిని హరిస్తున్నాయి. ఈ చిన్న చిన్న అశాంతి బిందువులే కాలక్రమేణా మహా సముద్రంలా మారి మన ఆరోగ్యాన్ని ముంచేస్తున్నాయి. మానసిక శాంతి గురించి మన పూర్వీకులు వేల ఏళ్ల క్రితమే గొప్ప మార్గదర్శనం చేశారు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు యోగస్థః కురు కర్మాణి అని చెబుతూ, ఫలితం మీద ఆశ వదిలి, సమత్వ స్థితిలో ఉండి పని చేయమని బోధించారు. గౌతమ బుద్ధుడు శాంతి అనేది లోపల నుండి రావాలి, బయట వెతకకూడదు అని ఉద్ఘాటించారు. మహాత్మా గాంధీ సైతం సంపద అనేది స్వర్ణ నాణేలలో లేదని, అది మన చిత్తశుద్ధిలో, ప్రశాంతతలో ఉందని చాటి చెప్పారు. ఈ రోజుల్లో గూగుల్, మైక్రోసాఫ్ట్, ఆపిల్ వంటి అంతర్జాతీయ సంస్థలు సైతం తమ కార్యాలయాల్లో మెడిటేషన్ రూమ్స్ ఏర్పాటు చేస్తున్నాయి. ఉద్యోగుల మానసిక స్థితి బాగుంటేనే సంస్థ ఉత్పాదకత పెరుగుతుందని వారు గుర్తించారు. ప్రాచీన యోగా, ధ్యాన పద్ధతులు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఒక లైఫ్ స్టైల్ గా మారుతున్నాయి. మరి ఈ గందరగోళ ప్రపంచంలో మనం శాంతిని ఎలా పొందగలం? దీని కోసం హిమాలయాలకు వెళ్లనక్కర్లేదు. మన జీవనశైలిలో చిన్న మార్పులు చేసుకుంటే చాలు, మనకు కావాల్సింది ఏది? మనం ఆశిస్తున్నది ఏది? ఈ రెండింటి మధ్య తేడా తెలిస్తే సగం సమస్యలు తీరిపోతాయి. ఉన్నదానితో తృప్తి చెందడం అనేది ఒక కళ. అది లేనప్పుడు ఎంత సంపాదించినా దాహం తీరదు. చాలామంది గతం గురించి బాధపడుతూ లేదా భవిష్యత్తు గురించి భయపడుతూ ప్రస్తుతాన్ని నాశనం చేసుకుంటారు. ఇప్పుడు, ఇక్కడ ఉండటం నేర్చుకోవాలి. పిల్లలతో గడిపేటప్పుడు ఆఫీసు టెన్షన్లను పక్కన పెట్టాలి. Comparison is the thief of joy (పోలిక సంతోషాన్ని దొంగిలిస్తుంది). ఒకరి జీవితంతో మరొకరికి సంబంధం లేదు. ప్రతి ఒక్కరి ప్రయాణం వేరు. ఇతరుల గెలుపును చూసి మనం కుంగిపోకూడదు. మనకు లేని వాటి గురించి ఏడవడం కంటే, మనకు ఉన్న వాటికి కృతజ్ఞత తెలపడం నేర్చుకోవాలి. రోజూ రాత్రి పడుకునే ముందు మన జీవితంలో జరిగిన కనీసం మూడు మంచి విషయాలను గుర్తు చేసుకోవాలి. సంక్షోభ సమయంలో మనకు అండగా నిలిచేది మన కుటుంబం మరియు స్నేహితులు. వారితో గడిపే నాణ్యమైన సమయం (Quality Time) మనకు మానసిక స్థైర్యాన్ని ఇస్తుంది. మానసిక శాంతి ఉన్నవారు వృత్తిపరంగా కూడా అద్భుతాలు చేయగలరని స్టాన్ఫోర్డ్ పరిశోధనలు చెబుతున్నాయి. ప్రశాంతమైన మెదడు సృజనాత్మక ఆలోచనలకు నిలయం. టాటా గ్రూప్ వ్యవస్థాపకుడు జమీడే టాటా గారు తన ఉద్యోగుల సంక్షేమానికి, వారి మనశ్శాంతికి పెద్దపీట వేశారు. అందుకే ఆ సంస్థ ఇప్పటికీ నీతికి, నిజాయితీకి మారుపేరుగా నిలుస్తోంది. అయితే, ఇక్కడ ఒక ముఖ్యమైన హెచ్చరిక కూడా ఉంది. ప్రశాంతత అంటే బద్ధకం కాదు. సంపాదనను పూర్తిగా వదిలేయమని దీని అర్థం కాదు. ఆర్థిక భద్రత అనేది ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. కానీ ఆ సంపాదనలో సమతుల్యత (Balance) ఉండాలి. ఒక సాఫ్ట్వేర్ ఇంజనీర్ అధిక జీతం ఇచ్చే ఉద్యోగాన్ని వదిలి, తన సొంత ఊరిలో తక్కువ జీతానికి చేరి, కుటుంబంతో సంతోషంగా గడుపుతున్నాడంటే, ఆయన జీవితంలో త్యాగం చేయలేదు. సరిగ్గా ఇన్వెస్ట్ చేశాడని అర్థం. ఆయన తన ఆరోగ్యం మరియు ప్రశాంతత మీద పెట్టుబడి పెట్టారు. చివరగా, నిజమైన సంపద అంటే బ్యాంకు బ్యాలెన్స్ కాదు, గుండె లోతుల్లో ఉండే ప్రశాంతత. వెండి పళ్లెంలో విందు భోజనం తిన్నా ఆకలి లేకపోతే వ్యర్థం, కోటి రూపాయల పరుపు మీద పడుకున్నా నిద్ర పట్టకపోతే వ్యర్థం. డబ్బు మనకు సౌకర్యాలను కొనివ్వగలదు కానీ సంతోషాన్ని కాదు. మనల్ని మనం ప్రేమించుకుంటూ, తోటివారికి సహాయం చేస్తూ, ప్రకృతితో మమేకమై జీవించడమే అసలైన విజయం. మనం చేసే ప్రతి పని మన మానసిక శాంతిని పెంచేలా ఉండాలి తప్ప, దాన్ని హరించేలా ఉండకూడదు. ప్రశాంతతే పరమ సుఖం అన్న మాటను మనం ఎప్పుడూ గుర్తుంచుకోవాలి. ఎందుకంటే, మన జీవిత ప్రయాణం ముగిసేటప్పుడు మనం ఎన్ని కోట్లు సంపాదించామన్నది ముఖ్యం కాదు, మనం ఎంత ప్రశాంతంగా, ఎంతమంది హృదయాలను గెలుచుకుంటూ జీవించామన్నదే అసలైన లెక్క.

> **డబ్బు మనకు సౌకర్యాలను కొనివ్వగలదు కానీ సంతోషాన్ని కాదు. మనల్ని మనం ప్రేమించుకుంటూ, తోటివారికి సహాయం చేస్తూ, ప్రకృతితో మమేకమై జీవించడమే అసలైన విజయం. మనం చేసే ప్రతి పని మన మానసిక శాంతిని పెంచేలా ఉండాలి తప్ప, దాన్ని హరించేలా ఉండకూడదు. ప్రశాంతతే పరమ సుఖం అన్న మాటను మనం ఎప్పుడూ గుర్తుంచుకోవాలి. ఎందుకంటే, మన జీవిత ప్రయాణం ముగిసేటప్పుడు మనం ఎన్ని కోట్లు సంపాదించామన్నది ముఖ్యం కాదు, మనం ఎంత ప్రశాంతంగా, ఎంతమంది హృదయాలను గెలుచుకుంటూ జీవించామన్నదే అసలైన లెక్క.**

కర్ణాటకలో ఎమ్మెల్యేకు రూ. 5 కోట్లు

- రాజ్యసభ సీటు కోసం బీజేపీ ఎత్తుగడ
- తీవ్ర ఆరోపణలు చేసిన డిప్యూటీ సీఎం శివకుమార్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, బెంగళూరు, మార్చి 15: రాజ్యసభ ఎన్నికలకు ముందు కర్ణాటకలో 'ఆపరేషన్ లోటస్'కు బీజేపీ ప్రయత్నించిందని డిప్యూటీ సీఎం శివకుమార్ విమర్శించారు. ఇక్కడకు తరలించిన ఒడిశా ఎమ్మెల్యేలకు రూ.5 కోట్లు చొప్పున ఆఫర్ చేసినట్లు ఆరోపించారు. క్రాస్ ఓటింగ్ కోసం లంచం ఇవ్వజూపిన వారిలో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. మార్చి 16న రాజ్యసభ ఎన్నికలు జరగనున్నాయి. ఒడిశాలోని అధికార బీజేపీ ప్రలోభాల నేపథ్యంలో ఆ రాష్ట్రానికి చెందిన 8 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఆ పార్టీ సీనియర్ నేతలను బెంగళూరులోని రిసార్ట్‌కు తరలించారు. కాగా, ఒడిశా బీజేపీకి చెందిన నలుగురు వ్యక్తులు ఆదివారం ఒడిశా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రిసార్ట్‌లో సంప్రదించినట్లు డిప్యూటీ సీఎం శివకుమార్ ఆరోపించారు. రాజ్యసభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ కోసం ఒక్కొక్కరికి రూ.5 కోట్ల చొప్పున వారు ఆఫర్ చేసినట్లు ఒడిశా ఎమ్మెల్యేలు చెప్పారన్నారు. 'కర్ణాటకలో బీజేపీ స్నేహితులు నిర్వహించిన గొప్ప 'ఆపరేషన్ లోటస్' ఇది. వారు ఖాళీ చెక్కును అందించడం ద్వారా కాంగ్రెస్ ఎమ్మెల్యేతో చర్చలు జరుపడానికి ప్రయత్నించారు' అని అన్నారు. నలుగురు వ్యక్తుల్లో ఇద్దరు అరెస్టైనట్లు వివరించారు. మరోవైపు ఒడిశా కాంగ్రెస్ శాసనసభ పక్ష ఉప నాయకుడు అశోక్ కుమార్ దాస్, బిడది పోలీస్ స్టేషన్‌లో దీనిపై ఫిర్యాదు చేశారు. తమ ఎమ్మెల్యేలను నలుగురు వ్యక్తులు సంప్రదించారని, రాజ్యసభ ఎన్నికల్లో ఒక బీజేపీ అభ్యర్థికి అనుకూలంగా క్రాస్ ఓటు వేయడానికి వారికి డబ్బు ఆశ చూపారని ఆరోపించారు. అయితే తమ ఎమ్మెల్యేలు ఈ ఆఫర్‌ను తిరస్కరించినప్పుడు, వారు ఒడిశాకు తిరిగి వస్తే చంపేస్తామని ఆ వ్యక్తులు బెదిరించినట్లు అశోక్ కుమార్ దాస్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రలోభాలకు గురి చేసేందుకు ప్రయత్నించిన వ్యక్తులను ఒడిశాకు చెందిన బిరేంద్ర ప్రసాద్, సురేష్, అజిత్ కుమార్ సాహు, సిమాచల్ మోహకుడ్‌గా ఆయన గుర్తించారు. కాగా, ఈ ఆరోపణలను ఒడిశా బీజేపీ ఖండించింది.

బెంగాల్‌లో ఈ సారి రెండు దశల్లో పోలింగ్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, కోల్ కతా, మార్చి 15: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో కీలక మార్పు చోటుచేసుకున్నది. గత ఎన్నికల్లో 8 దశల్లో భారీ స్థాయిలో పోలింగ్ జరిగింది. అయితే ఈసారి కేవలం రెండు దశల్లోనే పోలింగ్ నిర్వహించనున్నారు. పశ్చిమ బెంగాల్, అస్సాం, కేరళ, తమిళనాడు రాష్ట్రాలతోపాటు కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఆదివారం వెల్లడించారు. 2021లో పశ్చిమ బెంగాల్‌లో జరిగిన 8 దశల పోలింగ్ కంటే ఈసారి రెండు దశల్లో పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 23, 29 తేదీలలో పోలింగ్, మే 4న ఓట్ల లెక్కింపు జరుగుతుందని చెప్పారు. కాగా, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లో మార్చి చివరిలో ఓటింగ్ ప్రారంభమై ఏప్రిల్ 29 వరకు కొనసాగింది. సుమారు నెల రోజుల పాటు ఎనిమిది దశల్లో పోలింగ్ జరిగింది. అయితే ఈసారి పశ్చిమ బెంగాల్‌లో రెండు దశల్లో పోలింగ్ జరగనున్నది. వివరణాత్మక చర్చల తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తెలిపారు. ఈ రాష్ట్రంలో పోలింగ్ దశల సంఖ్యను తగ్గించడం అవసరమని సీఈసీ భావించిందని చెప్పారు. రెండు దశల షెడ్యూల్‌ను ఖరారు చేయడానికి ముందు పోల్ ప్యానెల్ విస్తృతమైన చర్చలు నిర్వహించిందని అన్నారు. దీంతో రెండు దశల పోలింగ్ బెంగాల్ రాజకీయాలు, ఎన్నికల ప్రచారాలను ప్రభావం చేయనున్నట్లు తెలుస్తున్నది.

రాహుల్ గాంధీ ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తున్నారు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 15: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారతదేశాన్ని, దాని ప్రజాస్వామ్యాన్ని కించపరిచేలా వ్యవహరిస్తున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆరోపించారు. ఇటీవలె దిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సదస్సు వద్ద కాంగ్రెస్ యువజన విభాగం నేతలు చొక్కాలు లేకుండా నిరసనకు దిగిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అది వ్యక్తిగత రాజకీయాలు చేసుకునే ప్రదేశం కాదని హితవు పలికారు. విపక్షాలకు నిరసన తెలిపే హక్కు తప్పకుండా ఉంటుందని, కానీ ఏఐ సదస్సులాంటి చోట నిరసన తెలపడం సరికాదన్నారు. బీజేపీ, ప్రధానమంత్రి నరేంద్రమోదీలను వ్యతిరేకించే క్రమంలో, చివరకు భారతదేశాన్ని కూడా వ్యతిరేకించడాన్ని రాహుల్ గాంధీ మొదలుపెట్టారని అమిత్‌షా విమర్శించారు. ఆదివారం అసోంలోని గువహటిలో జరిగిన బహిరంగ సభ వేదికగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నిజంగా సత్తాయే ఉంటే నేరుగా ప్రజాక్షేత్రంలో బీజేపీని ఢీకొనాలని కాంగ్రెస్ పార్టీకి అమిత్‌షా సవాల్ విసిరారు. ఏఐ సదస్సు లాంటి అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాల వద్ద నిరసనలకు దిగుతూ భారతీయ యువతకు అవకాశాలను కాంగ్రెస్ తగ్గిస్తోందన్నారు. అనవసరమైన చోట్ల ప్రతాపాన్ని చూపిస్తున్న రాహుల్ గాంధీ, పార్లమెంటు నుంచి మాత్రం పారిపోతున్నారని కేంద్ర హోంమంత్రి విమర్శించారు. ఇలా చేస్తున్నందుకు భారత ప్రజలు రాహుల్‌ను క్షమించరన్నారు.

ఈ సీజన్ ధోనీకి చివరిది కావచ్చు

- సంచలన వ్యాఖ్యలు చేసిన ఇర్ఫాన్ పఠాన్

ఐపీఎల్ 2026 సీజన్ చెన్నై సూపర్ కింగ్స్ మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీకి చివరిది కావచ్చని టీమిండియా మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ అభిప్రాయపడ్డాడు. ధోనీ లేకుండా సీఎస్‌కే అసంపూర్ణమని, అతను లేకుండా ఐపీఎల్‌ను ఊహించుకోవడం చాలా కష్టమని అన్నాడు. ఈ సీజన్ టైటిల్ గెలిచి ధోనీకి ఘనంగా వీడ్కోలు పలకాలని సీఎస్‌కే భావిస్తుందని చెప్పాడు. 44 ఏళ్ల వయసులో ఉన్న ధోనీ.. కేవలం ఐపీఎల్ మాత్రమే ఆడుతున్నాడు. 6 ఏళ్ల క్రితమే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అప్పటి నుంచి ప్రతీ సీజన్ ముందు ధోనీ రిటైర్మెంట్ గురించి వార్తలు వస్తూనే ఉన్నాయి. ధోనీ కూడా తన రిటైర్మెంట్ వార్తలపై క్లారిటీ ఇవ్వకుండా ఐపీఎల్‌లో కొనసాగుతున్నాడు. ఐపీఎల్ 2026 సీజన్ నేపథ్యంలో అధికారిక బ్రాడ్‌కాస్టర్ స్టార్ స్పోర్ట్స్ షోలో మాట్లాడిన ఇర్ఫాన్ పఠాన్.. ధోనీ రిటైర్మెంట్‌పై కీలక వ్యాఖ్యలు చేశాడు. 'ధోనీ లేకుండా సీఎస్‌కే అసంపూర్ణం. పసుపు రంగు జెర్సీలో అతన్ని చూడటం బహుశా ఇదే చివరిసారి కావచ్చు. ధోనీ లేకుండా CSK, ఐపీఎల్‌ను ఊహించుకోవడం చాలా కష్టం. ఈ సీజన్‌లో అందరినీ ఏకం చేయడంలో ధోనీ కీలక పాత్ర పోషిస్తాడు. ధోనీ ఎన్ని మ్యాచ్‌లు ఆడతాడో నాకు తెలియదు. కానీ డ్రెస్సింగ్ రూమ్‌లో అతని ఉనికి జట్టుకు ఎంతో సహాయపడుతుంది. రుతురాజ్ గైక్వాడ్ టీమ్ కెప్టెన్. అయితే భవిష్యత్తు కోసం ఇద్దరు, ముగ్గురు ఆటగాళ్లను సిద్ధం చేస్తున్నారు. ఈ విషయంలో ఎంఎస్ ధోనీ పాత్ర కీలకం అవుతుంది. అతను ఖచ్చితంగా మార్పు చూపిస్తారని నేను ఆశిస్తున్నా.

ఐసీసీ కంటే ఎవరూ పెద్ద కాదు

- పాకిస్తాన్. బంగ్లాదేశ్ కు జై షా కౌంటర్

టీ 20 ప్రపంచకప్ మొదలవ్వడానికి ముందు నెలకొన్న పరిణామాలపై ఎట్టకేలకు ఐసీసీ అధ్యక్షుడు జై షా స్పందించాడు. మెగా టోర్నీకి కొన్ని రోజుల ముందు ఏర్పడిన అనిశ్చితి వాతావరణంపై మాట్లాడిన షా.. ఐసీసీ కంటే ఏ దేశం పెద్దది కాదని పేర్కొన్నాడు. తాజాగా బీసీసీఐ వార్షిక అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న ఆయన బంగ్లాదేశ్, పాకిస్థాన్ క్రికెట్ బోర్డులకు పరోక్షంగా కౌంటర్ ఇచ్చాడు. పదో సీజన్ టీ20 వరల్డ్ కప్ ప్రారంభానికి ముందు.. భారత్‌లో ఆడబోమని బంగ్లాదేశ్ , టీమిండియాతో మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేస్తామని పాకిస్థాన్ బోర్డు బెట్టు చేసిన విషయం తెలిసిందే. ఇరుదేశాల బెదిరింపులకు ఏమాత్రం లొంగని ఐసీసీ చైర్మన్ జై షా.. తెలివిగా అనిశ్చితికి తెరదించాడు. అభిమానుల్లో ఉత్కంఠ రేపిన ఈ వ్యవహారంపై బీసీసీఐ వార్షిక అవార్డుల కార్యక్రమంలో షా మాట్లాడాడు. 'ఈ పొట్టి ప్వరంచకప్ చాలా ముఖ్యమైనది. ఎందుకంటే టోర్నీ ఆరంభానికి ముందు చాలా గందరగోళం నడించింది. వరల్డ్‌కప్‌లో కొన్నిజట్లు పాల్గొంటాయా? లేదా? ప్రపంచకప్ సాఫీగా జరుగుతుందా? వంటి ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. కానీ, ఐసీసీ చైర్మన్‌గా నేను కటే చెబుతాను. ఏ దేశం కూడా ఐసీసీ కంటే పెద్దది కాదు. అలాఅనీ ఒక జట్టుతోనే ఐసీసీ పరిపూర్ణం కాదు. అన్ని జట్లు కలిస్తేనే ఐసీసీ' అని జై షా పేర్కొన్నాడు.

ముహూర్తం కుదిరింది.. ట్రైలర్ అదిరింది

'ఉస్తాద్ భగత్ సింగ్'కి చిరంజీవి ప్రశంసలు

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా రాశి ఖన్నా అలాగే శ్రీలీల హీరోయిన్స్ గా దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కించిన సాలిడ్ ఎంటర్టైనర్ చిత్రమే ఉస్తాద్ భగత్ సింగ్. అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఈ సినిమా ఈ ఉగాది కానుకగా విడుదల కాబోతుంది. అయితే ఈ సినిమా నుంచి లేటెస్ట్ గా వచ్చిన ట్రైలర్ మాత్రం అభిమానుల్లో మంచి బజ్ ని పెంచింది. ఇక ఈ ట్రైలర్ పై మన టాలీవుడ్ స్టార్స్ నుంచి కూడా ఫీడ్ బ్యాక్ వచ్చింది. మరి లేటెస్ట్ గా మెగాస్టార్ చిరంజీవి అలాగే మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కూడా ఈ సినిమా ట్రైలర్ పై తమా స్పందన తెలియజేయడం వైరల్ గా మారింది. మ్యాజిక్ జరిగింది.. ముహూర్తం కుదిరింది.. ట్రైలర్ అదిరింది.. ఉగాదికి "ఉస్తాద్ భగత్ సింగ్" తో అన్నీ శుభాలే!! అంటూ తన మార్క్ రెస్పాన్స్ తో చిత్ర యూనిట్ కి తన బ్లెస్సింగ్స్ అందించారు. అలాగే రామ్ చరణ్ ఉస్తాద్ భగత్ సింగ్ ట్రైలర్ టెర్రిఫిక్ గా ఉంది అని పవన్ కళ్యాణ్ గారు ఫుల్ స్వాగ్ తో ఫెంటాస్టిక్ గా ఉన్నారు. హరీష్ గారికి ఎలా ప్రెజెంట్ చెయ్యాలో బాగా తెలుసు అంటూ పోస్ట్ చేయడంతో ఈ పోస్ట్ లు ఫ్యాన్స్ లో నూతన ఉత్సాహాన్ని తీసుకొచ్చింది. ఇక ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహించారు.

అంతర్జాతీయ క్రికెట్‌కు పాక్ మాజీ కెప్టెన్ వీడ్కోలు

పాకిస్థాన్ మాజీ కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. దాదాపు మూడేళ్లుగా జాతీయ జట్టుకు దూరమైన సర్ఫరాజ్ రిటైర్మెంట్‌కు సమయం వచ్చిందని భావించాడు. ఇక ఆలస్యం చేయకూడదని ఆదివారం అతడు అల్విదా చెప్పేశాడు. దాంతో.. ఈ మాజీ సారథి 20 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు ఎండ్ కార్డ్ పడింది. పాక్ జూనియర్ జట్టుకు కోచ్‌గా వ్యవహరించిన సర్ఫరాజ్ సీనియర్ జట్టు కోచ్‌గా ఎంపికయ్యే అవకాశముంది. పాకిస్థాన్ క్రికెట్‌లో విజయవంతమైన సారథిగా చరిత్రకెక్కిన సర్ఫరాజ్ అహ్మద్ కెరీర్ ముగిసింది. అంతర్జాతీయంగా 100 మ్యాచుల్లో సారథిగా వ్యవహరించిన సర్ఫారాజ్ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 'పాకిస్థాన్‌కు ప్రాతినిధ్యం వహించడం నా జీవితంలో దక్కిన గొప్ప గౌరవం. అండర్ 19 జట్టును 2006లో ఛాంపియన్‌గా నిలపడం, 2017లో ఛాంపియన్స్ ట్రోఫీ విజయం.. పాక్ జెర్సీలో ప్రతి క్షణం ప్రత్యేకమైనదే.



శార్వానంద్ కొత్త మూవీ టైటిల్ ఫిక్స్

హీరో శర్వానంద్ – శ్రీను వైట్ల కాంబినేషన్ లో రాబోతున్న సినిమా టైటిల్ పై ఇప్పటికే కొన్ని రూమర్స్ వైరల్ అయ్యాయి. వాటిలో 'జార్జ్ క్రిష్' కూడా ఒకటి. ఐతే, తాజాగా వినిపిస్తున్న అప్ డేట్ ప్రకారం ఈ సినిమాకి జార్జ్ క్రిష్ అనే టైటిల్ నే ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. మొత్తానికి ఈ టైటిల్ చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంది. కాగా టైటిల్ ను కథకు తగ్గట్టే పెట్టారట. ప్రస్తుతం ఈ సినిమాకి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఇక ఈ సినిమాలో రుక్మిణీ వసంత్ హీరోయిన్ గా ఫిక్స్ అయినట్టు తెలుస్తోంది. అన్నట్టు శర్వానంద్ ఈ సినిమా కోసం తన లుక్ ను మళ్లీ కొత్తగా ట్రై చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఐతే, గోపీచంద్ హీరోగా శ్రీను వైట్ల దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ కామెడీ 'విశ్వం' ఏవరేజ్ గా నిలిచింది. దీంతో, ఎలాగైనా మళ్ళీ టాలీవుడ్ లో తన తర్వాత సినిమాతో బిజీ అయ్యేందుకు శ్రీనువైట్ల తెగ కష్ట పడుతున్నాడు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మించనుంది.



మలైకా.. రైక కేక!!

బాలీవుడ్ సీనియర్ బ్యూటీ మలైకా అరోరా ఫ్యాషన్ ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేక సామ్రాజ్యాన్ని సృష్టించుకుంది. తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోల్లో తన స్టైలిష్ లుక్స్‌తో అభిమానుల గుండెల్లో మంటలు రేపుతోంది. ముఖ్యంగా ఆ జబ్బల రవిక కాంబినేషన్ డిజైనర్ కోకలో మల్లా మెరిసిపోతున్న తీరు `కేక` పెట్టించేలా ఉంది. సాంప్రదాయ చీరకట్టుకు మోడ్రన్ టచ్ ఇస్తూ మలైకా చేస్తున్న ఈ ఫ్యాషన్ ప్రయోగాలు నెటిజన్లను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ఇది గౌరి అండ్ నైనిక డిజైనర్ శారీ. ప్రస్తుతం 52 ఏళ్ల వయసులో ఉన్నా కానీ..మలైకా తన ఫిట్‌నెస్‌తో నేటి తరం హీరోయిన్లకు గట్టి పోటీనిస్తోంది. వయసు అనేది కేవలం ఒక నంబర్ మాత్రమేనని నిరూపిస్తోంది. బికినీలు, స్విమ్ వేర్లలో ఎంతటి గ్లామర్‌ను చిందిస్తుందో.. చీరకట్టు వంటి ట్రెడిషనల్ అవతారాల్లో అంతే హుందాతనాన్ని ప్రదర్శిస్తోంది. మలైకా ఫ్యాషన్ సెన్స్ నుండి నేటితరం నేర్చుకోవాల్సింది ఏమిటంటే.. బాడీ లాంగ్వేజ్‌కు తగ్గట్టుగా దుస్తులను ఎంపిక చేసుకోవడం.. ఏ రకమైన దుస్తులనైనా పూర్తి ఆత్మవిశ్వాసంతో ధరించడం. మలైకా వ్యక్తిగత జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా కెరీర్ పరంగా ఏమాత్రం వెనకడుగు వేయలేదు. అర్బాజ్ ఖాన్‌తో వివాహ బంధం ముగిసినా.. ఆ తర్వాత అర్జున్ కపూర్‌తో ప్రేమాయణం బ్రేకప్ అయినా.. కుంగిపోకుండా తన కెరీర్‌పై దృష్టి సారించింది. వ్యక్తిగత బాధలను తన వృత్తిగత ఎదుగుదలకు అడ్డంకిగా మార్చుకోకుండా.. మరింత స్ట్రాంగ్‌గా నిలబడటం మలైకాలోని గొప్ప లక్షణం. ప్రస్తుతం ఈ బ్యూటీ తన ఫోకస్ అంతా కెరీర్, ఫిట్‌నెస్‌పైనే ఉంచుతూ అందరికీ స్ఫూర్తిగా నిలుస్తోంది.

సన్ రైజర్స్ కు షాక్... ఆబ్రార్ ఆడకపోవచ్చు

"ది హండ్రెడ్" 2026 టోర్నమెంట్ వేలంలో పాకిస్థాన్ మిస్టరీ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్‌ను సన్‌రైజర్స్ లీడ్స్ జట్టు ఏకంగా సుమారు రూ.2.34 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది. ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యానికి చెందిన ఈ జట్టు.. ఓ పాకిస్థాన్ ఆటగాడిని కొనుగోలు చేయడం క్రీడా ప్రపంచంలో చర్చకు దారితీసింది. అయితే ఈ కొనుగోలు జరిగినప్పటి నుంచి భారీగా వ్యతిరేకత రావడమే కాకుండా ఇప్పుడు అబ్రార్ అహ్మద్ టోర్నీలో ఆడటంపైనే నీలినీడలు కమ్ముకున్నాయి. అబ్రార్ అహ్మద్ ఈ లీగ్‌లో ఆడటంపై సందిగ్ధతకు ప్రధాన కారణం షెడ్యూల్ తేదీలు. పాకిస్థాన్ జాతీయ జట్టు జులై 15 నుంచి ఆగస్టు 7 వరకు వెస్టిండీస్‌లో పర్యటించనుంది. ఈ పర్యటనలో భాగంగా రెండు టెస్ట్ మ్యాచ్‌లు జరగనున్నాయి. మరోవైపు 'ది హండ్రెడ్' టోర్నీ జులై 21న ప్రారంభమై ఆగస్టు 16 వరకు కొనసాగనుంది. అంటే టోర్నీ జరిగే సమయంలోనే పాకిస్థాన్ జట్టు అంతర్జాతీయ పర్యటనలో ఉండటంతో అబ్రార్ అహ్మద్ తన దేశం తరఫున ఆడాల్సి ఉంటుంది. దీనివల్ల అబ్రార్ అహ్మద్‌కు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నుంచి 'నో అబ్జెక్షన్ సర్టిఫికేట్' (NOC) లభించడం కష్టమని తెలుస్తోంది.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana- 500008. Editor: MOHAMMED AZIZ UR RAHAMAN. 040-4565 1990, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200